కడప నగరంలో అక్రమ కట్టడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు సాగిస్తున్నా టౌన్ ప్లానింగ్ విభాగం అటు వైపు చూడడం లేదు. మాది మాకిచ్చెయ్.. మీరెమన్నా చేసుకోండి అని అందినకాడికి డబ్బులు దండుకుంటున్నారు. ఇంకా విశేషమేమంటే.. మీకేదైనా అవసరం ఉంటే నేరుగా మమ్మల్నే కలవండి.. మధ్యవర్తులను కలిస్తే మాకేం వస్తుంది అని నగరవాసులకు బంపర్ ఆఫర్ ఇచ్చేస్తున్నారు. ఈ విభాగంలో పనిచేసే ఓ ఇద్దరు ఉద్యోగులు కొన్నేళ్లుగా ఇక్కడే తిష్ఠ వేసి చక్రం తిప్పుతూ సెటిల్‌మెంట్లు చేస్తుండడంతో సిటీ ప్లానింగ్ విమర్శలకు గురవుతోంది.


ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి

● ఎస్పీ అశోక్‌కుమార్


బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోను చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించేందుకు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం, మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా.. అక్రమ కట్టడాలు



● నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు
● పైసలు తీసుకుని పట్టించుకోని ప్లానింగ్ విభాగం
● మధ్యవర్తులతో రావద్దు, నేరుగా కలవండి
● టౌన్‌ప్లానింగ్ అధికారుల బంపర్ ఆఫర్
● ఓ నేతతో కలిసి అక్రమ కట్టడాలు పరిశీలన
● తరువాత సెటిల్‌మెంట్లు
● గాడితప్పిన సిటీప్లానింగ్

(కడప-ఆంధ్రజ్యోతి): కడప గడపలో అనుమతులు లేని కట్టడాలు కోకొల్లలుగా నిర్మాణం సాగుతున్నాయి. కార్పొరేషన్ సిటీప్లానింగ్ విభాగం వాటిని అడ్డుకోవాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇక్కడ అవినీతికి అలవాటుపడిన కొందరు అధికారులు ఇక్కడే తిష్ఠ వేసి అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నట్లు సమాచారం. గతంలో లేని విధంగా ఇప్పుడు నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. ఎలాగంటే భారీ స్థాయిలో డబ్బులు గుంజేసి అక్రమ కట్టడాలకు ప్రోత్సహిస్తున్నారని విమర్శ ఉంది. ముఖ్యంగా సిటీప్లానింగ్‌లో ఓ ఇద్దరు అధికారుల అవినీతికి అంతేలేకుండా పోయిందంటారు. అనుమతులు లేని లేఅవుట్లు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే భవనాలపై ఎమ్మెల్యే మాధవి సీరియస్ అయ్యారు. అయినా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు సాగుతుండడం గమనార్హం.

మాది మాకిచ్చేయ్.. మీరేమన్నా చేసుకోండి..

సిటీ ప్లానింగ్ అధికారులు ఎలా బరితెగించారంటే ఏదైనా ప్లాన్ కోసమో లేకపోతే లేఅవుట్ వేసేందుకో కార్పొరేటరో లేక ఆ పదవిలో ఇన్‌చార్జ్‌ల ద్వారా కొందరు అధికారుల వద్దకు వెళ్తారు. అయితే 'మీరు మధ్యవర్తులతో రావద్దు, మీరు మాకు ఇచ్చేది కరిగిపోయి మాకు తక్కువ వస్తుంది. ఇచ్చేది మీరు.. పనులు చేసేది మేము, నేరుగా మా వద్దకు రండి' అంటూ ఆ ఇద్దరు అధికారులు బాగా ఆఫర్ ఇస్తున్నట్లు ప్రచారం ఉంది. ఎంతలా అంటే కాల్వలు ఆక్రమించేసి కమర్షియల్ నిర్మాణాల్లో కనీస నిబంధనలు పాటించకుండా కట్టేస్తున్నా డబ్బు కట్టలతో వారి నోర్లు మూయించేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై సిటీ ప్లానర్ వెంకటరమణను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. నిబంధనలు అతిక్రమించి ఉంటే ఆ భవనాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఈ పక్కనే అపార్ట్‌మెంటుకు ప్లాన్‌లో రోడ్డు చూపించారు. అయితే ఆ రోడ్డు గూడూరు సర్వే నెం.209లో 30 సెంట్ల ప్రభుత్వ కాల్వ భూమి ఉంది. దాన్ని ఆక్రమించేసి రోడ్డు వేశారు. రికార్డుల్లో కాల్వ అని స్పష్టంగా ఉన్నప్పటికీ పట్టించుకోలేదు. ఇప్పటికీ కూడా ఆన్‌లైన్‌లో కాల్వ అనే కనిపిస్తోంది. వాస్తవంగా బఫర్‌జోన్ వదిలి నిర్మాణం చేపట్టాలి. అయితే నిబంధనలు ఏమీ పాటించలేదు. ఒక్కో ఫ్లోరుకు 4 చొప్పున మొత్తం 20 ఫ్లాట్లకు గానూ డబుల్ బెడ్‌రూము తీసుకుని నిర్మాణానికి ట్రిబుల్ బెడ్ల నిర్మాణం చేపట్టడం గమనార్హం. నాలుగు ఫ్లోర్లలో జీప్లస్4 నిర్మాణం చేపడితే రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ 2016 అనుమతి తీసుకోవాలి. వాస్తవంగా దీనికి రెరా ప్రకారం అనుమతి రాదు. డాక్యుమెంటులోని అసెస్‌మెంటు నెంబరుకు, ప్లాన్‌లోని అసెస్‌మెంటు నెంబరుకు తేడా ఉంది. ఓపెన్ స్పేస్ 14 శాతం ఫీజు, బెటర్‌మెంటు చార్జీలు సుమారు రూ.20 లక్షలు కట్టకపోవడంతో కార్పొరేషన్ ఆదాయం కోల్పోయింది. అయితే ఇక్కడ అన్ని వసతులు ఉన్నట్లు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వడం కూడా గమనార్హం. ఇక్కడ సుమారు 20 నుంచి 25 లక్షల మేర చేతులు మారినట్లు ప్రచారం సాగుతోంది.


వినాయకనగర్‌లోని యూనివర్సల్ బ్యాక్‌సైడ్‌లో గూడూరు రెవెన్యూ గ్రామపాలెం సర్వే నెం.286లో 18 సెంట్లలో జీప్లస్ 4 అపార్ట్‌మెంటు నిర్మించారు. ఇందులో పూర్తిగా నిబంధనలు అతిక్రమించారు.

రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎస్‌ఆర్ థియేటరు ఎదురుగా నిర్మిస్తున్న జీప్లస్4 కమర్షియల్ భవనం నిర్మాణంలో అంతా ఉల్లంఘనే అంటారు. ఇది వైసీపీ ముఖ్యనేత బంధువుది కావడం గమనార్హం. ఇక్కడ పాక్షిక అనుమతులు తీసుకుని జీప్లస్ 4 నిర్మాణం చేపడుతున్నారు. ఇక్కడ కూడా నిబంధనలు పాటించలేదు. భవనం చుట్టూ సెట్‌బ్యాక్ లేదు. ఇది కమర్షియల్ భవనం, ఏదైనా ప్రమాదం జరిగితే భారీగా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. ఇక్కడ కూడా సుమారు రూ.10 లక్షల మేర చేతులు మారినట్లు ప్రచారం ఉంది. టౌన్ ప్లానింగ్‌లోకి కీలకమైన అధికారి వచ్చినప్పటి నుంచి అక్రమ కట్టడాలకు అడ్డే లేకుండా పోయినట్లు చెబుతున్నారు. మొత్తానికి అయితే ఇప్పుడు కార్పొరేషన్‌లో అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతుండడం గమనార్హం.


సాయిబాబా థియేటరు ఎదురుగా నిర్మాణంలో ఉన్న కమర్షియల్ భవనం

డ్రగ్స్ రహిత జైళ్లుగా మారుస్తాం

● ఖైదీల వద్ద సెల్‌ఫోన్లు దొరికితే సిబ్బందిపై తక్షణ చర్యలు
● జైళ్లశాఖ డీజీ అంజనీకుమార్


మాట్లాడుతున్న డీజీ అంజనీకుమార్

కడప క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌రహిత జైళ్లుగా మార్చేందుకు కృషి చేస్తామని జైళ్లశాఖ డీజీ అంజనీకుమార్ స్పష్టం చేశారు. కడప సెంట్రల్ జైలు, మహిళా జైలులో సోమవారం మధ్యాహ్నం ఆయన తనిఖీలు నిర్వహించారు. జైల్లోని ప్రతి బ్యారక్‌ను పరిశీలించడంతో పాటు భోజనశాలను కూడా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రి జైలును కూడా ఇటీవల తనిఖీలు చేశామని, తనిఖీల్లో భాగంగా కడప సెంట్రల్ జైలు, మహిళా జైల్లో తనిఖీలు చేసి సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించామన్నారు. జీరో డ్రగ్స్‌ను నార్కోటిక్ చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రగ్స్ సొసైటీకి పెద్ద సవాల్‌గా మారిందని, అందులో భాగంగా అక్కడక్కడా ఖైదీలు మత్తుకు బానిసై ఉంటారని, వారిని కూడా పరివర్తన చేసేందుకు డ్రగ్స్ సెంటరును ప్రారంభించామన్నారు. జైళ్లలో కొన్ని ఎలక్ట్రికల్ పనులు పెండింగులో ఉన్నాయని, వాటిని మూడు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. ఇటీవల కడప సెంట్రల్ జైలులో సెల్‌ఫోన్లు దొరకడంతో ఇరువురు సిబ్బందిని సస్పెండ్ చేశామని, మరో ముగ్గురిని ఇతర జైళ్లకు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలిపారు. ఖైదీల వద్ద మత్తు పదార్థాలు కానీ, సెల్‌ఫోన్లు దొరికిన వెంటనే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం జైలు అధికారులతో సమీక్ష నిర్వహించి ఖైదీల వివరాలు జైల్లో ఉన్న పరిశ్రమల పెట్రోలు బంకుపై అడిగి తెలుసుకోవడంతో పాటు వాటికి సంబంధించి రికార్డులను పర్యవేక్షించారు.

రాయలసీమ జైళ్ల శాఖ డీఐజీగా రవికిరణ్..?

కడప క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జైళ్లశాఖ డీఐజీగా రవికిరణ్ రానున్నట్లు తెలుస్తోంది. ఈయన గతంలో కడప సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసి డీఐజీగా పదోన్నతి పొందారు. కడప జైళ్లశాఖ డీఐజీగా కూడా పనిచేశారు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ డీఐజీలుగా కడప సూపరింటెండెంట్లు విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం రవికిరణ్ పూర్తిస్థాయిలో డీఐజీగా విధులు నిర్వహించనున్నట్లు సమాచారం.

తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు ప్రత్యేక పూజలు

● కొండాపురంలో స్టాపింగ్‌పై స్థానికుల హర్షం


రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి హర్షం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు

కొండాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు కొండాపురం రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రైలుకు సోమవారం నుంచి కొండాపురంలో స్టాపింగ్ ఇవ్వడంతో మొదటిరోజు రైలు స్టేషన్‌కు చేరుకోగానే స్థానికులు పూజలు నిర్వహించారు. విశాఖపట్నం-కడప మధ్య నడిచే ఈ రైలు కొండాపురం వరకు వచ్చి స్థానిక రైల్వేస్టేషన్‌లో నీళ్ల నింపుకొని వెళ్లేది. ఖాళీగా వెళుతున్న ఈ రైలుకు కొండాపురంలో స్టాపింగ్ లేకపోవడంతో టికెట్లు ఇచ్చేవారు కాదు. ఇదే విషయమై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డితో పాటు ప్రజాసంఘాల నాయకులు పలుమార్లు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తెచ్చారు. దీంతో ఈ రైలును కడప నుంచి గుంతకల్లు వరకు పొడిగించడంతో పాటు ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు రైల్వేస్టేషన్లలో స్టాపింగ్ ఇస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కడప నుంచి గుంతకల్లు వరకు ఈ ట్రైన్‌ను స్పెషల్ ట్రైన్ (ట్రైన్ నెం. 07521 /07522) గా పరిగణిస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం నుంచి కడపకు ఉదయం 7.45 గంటలకు చేరుకుని ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి మీదుగా గుంతకల్లుకు ఉదయం 11.15కు చేరుకుంటుంది. తిరిగి గుంతకల్లులో మధ్యాహ్నం 1.30 కు బయలుదేరి కొండాపురం, ఎర్రగుంట్ల మీదుగా కడపకు సాయంత్రం 5.15కు చేరుకొని అక్కడి నుంచి విశాఖపట్నం వెళుతుంది. గుంతకల్లు నుంచి విజయవాడ మీదుగా వైజాగ్ వెళ్లే రాయలసీమ వాసులకు ఈ రైలు ఎంతో సౌకర్యంగా ఉండనుంది.

అంగడివీథిలో ఐపీ పెట్టనున్న వ్యాపారి?

● రూ.3 నుంచి 4 కోట్లతో పరారీ!

సీకేదిన్నె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం కార్పొరేషన్ పరిధిలో అంగడివీధి చిన్నముసలిరెడ్డిపల్లిలో ఓ వ్యాపారి రూ.3 నుంచి 4 కోట్లకు ఐపీ పెట్టనున్నట్లు సమాచారం. అంగడివీధిలో కొంతకాలంగా మైదుకూరుకు చెందిన వ్యక్తి స్థానికంగా వివాహం చేసుకుని వస్త్ర దుకాణం నడుపుకుంటూ చీటీల వ్యాపారం చేస్తుండేవాడు. అయితే ఇటీవల కొందరు చీటీలు ఎత్తుకున్నవారికి అతడు సకాలంలో డబ్బులు ఇవ్వకపోవడంతో వారు అతడిని నిలదీసినట్లు తెలిసింది. దీంతో అతనికి ఏమి చేయాలో దిక్కు తెలియక అద్దెకు ఉన్న ఇల్లు ఖాళీ చేసి ఎటో వెళ్లి పోయినట్లు స్థానికుల సమాచారం. అయితే దాదాపు రూ.3 నుంచి రూ.4 కోట్ల వరకు డబ్బులు వసూలు చేసుకుని పరారీ అయినట్లు స్థానికులు చెబుతున్నారు. కొందరు ఈ విషయమై పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేందుకు కూడా సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా త్వరలోనే అతడు ఐపీ పెట్టనున్నట్లు తెలుస్తోంది.

ఇండోర్ స్టేడియం ఎన్నటికో...
● శిలాఫలకానికే పరిమితం
● క్రీడాకారులకు తప్పని ఇక్కట్లు
6
● మంజూరైన నిధులు రద్దు

పెద్దమ్మ గుడివద్ద తీవ్ర ఉద్రిక్తత
7
● పోట్లదుర్తిలో భారీ బలగాలు మోహరింపు

దర్జాగా ఆక్రమణ

● పెన్నా ఇసుక దిన్నెలు మాయం
● ఏటి పొరంబోకు భూముల్లో అక్రమ సాగు
● వరదనీటితో గ్రామాలకు పొంచి ఉన్న ప్రమాదం


ఏటిపొరంబోకు స్థలాన్ని చదును చేసి సాగుకు అనువుగా మార్చిన దృశ్యం


ఏటిపొరంబోకు భూమిలో సాగు చేసిన వేరుశనగ

చాపాడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురూరు, రాజుపాళెం గ్రామాల వద్ద ఉన్న సుమారు వంద ఎకరాల ఏటి పొరంబోకు భూములను చాలా మంది ఆక్రమించుకున్నారు. దర్జాగా వరి, వేరుశనగ, కొర్ర వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఈ గ్రామాలను ఆనుకుని పెన్నానది సుమారు ఏడు కిలోమీటర్ల పొడవునా ప్రవహిస్తోంది. ఈ నదికి ఒకవైపు ఎత్తైన ఇసుకదిన్నెలు ఉన్నాయి. ఇవి సుమారు 20 అడుగుల ఎత్తు ఉండేవి. ఈ నది పక్కన రాజుపాళెం, వెదురూరు, నరహరిపురం, కుచ్చుపాప, తిప్పిరెడ్డిపల్లె, నంగనాయక తువ్వ, మిడుతూరు గ్రామాలు ఉన్నాయి. సుమారు 1700 మంది జనాభా నివసిస్తున్నారు. పెన్నానదికి వర్షాకాలంలో ఉధృతంగా వరదనీరు వచ్చినప్పుడు ఈ గ్రామాల్లోకి నీరు రాకుండా ఎత్తైన ఇసుకదిన్నెలు రక్షణగా ఉపయోగపడుతున్నాయి. అందువలన ఇప్పటిదాకా ఈ గ్రామాలు వరదబారిన పడలేదు. కానీ గత ఐదేళ్ల నుంచి చాలా మంది ఇసుకదిన్నెలను మింగేస్తున్నారు. వందలాది ట్రాక్టర్లతో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో ఇసుకదిన్నెల ఎత్తు తగ్గిపోతోంది. ఆ తగ్గిన చోట రైతులు భూములను చదును చేసి పంటలు సాగు చేసుకునేందుకు తయారు చేస్తున్నారు. నదీ తీరం వెంబడి సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవునా ఇసుక దిన్నెలు మాయం అయ్యాయి. పెన్నానదికి వరదనీరు ఎక్కువగా వస్తే ఆ నీరు బలహీనమైన ప్రాంతం నుంచి గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉంది. అందువలన ఆ గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏటి పొరంబోకు భూములు ఆక్రమణకు గురైనా విజిలెన్స్ అధికారులుకానీ, ఇరిగేషన్ అధికారులు కానీ, రెవెన్యూ అధికారులు కానీ పట్టించుకోవడంలేదు.

భూములకోసం ఘర్షణ

సర్వే నంబరు 538లో ఏటి పొరంబోకు భూములు ఉన్నాయి. ఇవి కాక ప్రభుత్వ భూములు 489/2లో 22 ఎకరాలు, సర్వే నంబరు 487, 488లలో 7.30 ఎకరాలు ఉన్నాయి. ఈ భూములను కూడా బడా నేతలు ఆక్రమించుకున్నారు. ఈ భూముల కోసం ఇటీవల రాజుపాళెం గ్రామంలో టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఇనుపరాడ్లు, మచ్చుకత్తులు, కట్టెలతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఎనిమిది మంది గాయపడ్డారు. ప్రభుత్వ భూములను ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన అవసరం ఉంది.

ఆక్రమణలు నిజమే

ఈ విషయమై తహశీల్దారు రమాకుమారిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైన విషయం నిజమేనన్నారు. ఈ భూముల్లో ఎవరూ దిగవద్దని ఆక్రమణదారులకు చెప్పామన్నారు. త్వరలో కొలతలు వేసి హద్దులు నిర్ణయిస్తామన్నారు. విజిలెన్స్ అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఇష్టారాజ్యంగా బదిలీలు !

● ఉద్యోగుల గగ్గోలు
● డీపీవో శాఖలో గ్రేడ్-4 సెక్రటరీల ఆందోళన


బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందంటూ డీపీవోను ప్రశ్నిస్తున్న గ్రేడ్-4 సెక్రటరీలు

కడప రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ, డీపీవో శాఖలలో సోమవారం నిర్వహించిన బదిలీలపై ఉద్యోగులు గగ్గోలు పెట్టారు. ప్రభుత్వ నిబంధనలకు పాతరేసి అడ్డగోలుగా చేశారని ఆవేదన చెందారు. బదిలీల్లో అన్యాయం చేస్తున్నారంటూ కొందరు అడిగినా పట్టించుకోలేదు. కౌన్సిలింగ్‌లో కొందరి హవా నడిచిందని వారు చెప్పినట్లు కౌన్సిలింగ్ నిర్వహించారని దీనికి అధికారులు రైట్ రైట్ అంటూ తలలు ఊపారని కొందరు ఆరోపిస్తున్నారు. జడ్పీ శాఖలో 5 ఏళ్లు ఒకేచోట పనిచేసిన కొందరు ఉద్యోగులను కదిలించలేదు. నిబంధనల మేరకు వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉన్నా పట్టించుకోలేదు. అదే స్థానంలో ఉంటామని కొందరు అడిగిందే తడవు అనుగ్రహించారు. మరికొందరు ఐదేళ్లు సర్వీస్ పూర్తి అయిందని మరో ప్రాంతానికి వెళతామని అడిగినా వారు కోరిన స్థానాలు గానీ, ఆప్షన్ పెట్టినవి గానీ ఇవ్వలేదు. అలాంటప్పుడు కౌన్సిలింగ్ నిర్వహించడం ఎందుకంటూ బాధిత ఉద్యోగులు నిట్టూర్చారు. డీపీవో శాఖలో నిర్వహించిన బదిలీలు గందరగోళంగా మారాయి. గ్రేడ్ -4 పంచాయతీ సెక్రటరీలు బదిలీల వ్యవహారంలో అన్యాయం చేశారంటూ ఆవేదన చెందారు. డీపీవో శాఖలోని కౌన్సిలింగ్ కార్యాలయం ఎదుట దాదాపు 30 మంది గ్రేడ్-4 సెక్రటరీలు కౌన్సిలింగ్ వద్దకు వెళ్లి నిర్వాహకులను ప్రశ్నించారు. తాము గ్రేడ్-3లో పనిచేస్తున్నామని అక్కడ నుంచి బదిలీ చేశారని అదేవిధంగా తమ గ్రేడ్-4లో గ్రేడ్-5 పంచాయతీ సెక్రటరీలు పని చేస్తున్నారని వారిని అక్కడ నుంచి బదిలీ చేసి తమ స్థానంలో తమకు అవకాశాలు ఎందుకు కల్పించలేదని డీపీవోను ప్రశ్నించారు. విలేకరులకు ఎందుకు చెప్పారు. వారికి చెబితే ఏమవుతుంది అంటూ బాధిత ఉద్యోగులపై అధికారులు చిందులు వేశారు. దీంతో బదిలీల వ్యవహారం గందరగోళంగా మారింది.

జడ్పీ శాఖలో...

జిల్లా ప్రజా పరిషత్ శాఖలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. జడ్పీ చైర్మన్ రామగోవింద్‌రెడ్డి, వైస్ చైర్మన్ పిట్టుబాలయ్య యాదవ్, జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ, డిప్యూటీ సీఈవో మైధిలి, ఏవోలు నాగిరెడ్డి, భాష్కర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. జడ్పీ యాజమాన్య పరిధిలో ఒకే ప్లేస్‌లో 5 సంవత్సరాలు పూర్తి చేసిన వారితో పాటు రిక్వెస్ట్ బదిలీలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించారు. మొదటగా పరిపాలనాధికారులకు తరువాత సీనియర్ అసిస్టెంట్‌లకు, జూనియర్ సహాయకులకు, టైపిస్టులకు, రికార్డు అసిస్టెంట్లకు, ఆఫీస్ సబార్డినేట్స్, వాచ్‌మన్‌లకు ఎంపీడీవోలను బదిలీ చేశారు.

రైతులకు అవగాహన సదస్సు

● జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

సిద్దవటం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వికసిత్ కృషి సంకల్ప అభియాన్ పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఐ.నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సిద్దవటం ఎంపీడీవో సభాభవనంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కోసం ప్రతిరైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వరి, సజ్జ, చిరుధాన్యాలు, సాగు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటలు సాగు విస్తీర్ణం పెంపు ప్రకృతి వ్యవసాయ విధానాలు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ టెక్నాలజీ ప్రాధాన్యత, పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి భరత్‌రెడ్డి, జిల్లా రీసోర్స్ కమిటీ సభ్యులు పద్మజ, శాస్త్రవేత్తలు, మానస, ఖురేషి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల రైతులు పాల్గొన్నారు.

నిత్యపూజస్వామికి హుండీ ద్వారా రూ.1,08,353 ఆదాయం



నిత్యపూజ ఆలయ హుండీ లెక్కింపులో పాల్గొన్న ఎండోమెంట్ సిబ్బంది, స్థానిక పోలీసులు

సిద్దవటం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంతాటిపల్లె గ్రామ పంచాయతీలోని లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూస్వామి దేవస్థానానికి సంబంధించిన హుండీలను సోమవారం లెక్కించగా రూ.1,08,353 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.శ్రీధర్ తెలిపారు. స్వామివారి హుండీలో భక్తులు వేసిన కానుకలు ద్వారా మార్చి 28 నుంచి జూన్ 2 వరకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ, ధర్మదాయశాఖ కొండా గంగమ్మ దేవస్థానం, నందిమండలం కార్యనిర్వహణ అధికారి మారుతిప్రసాద్ ఆలయ కార్యనిర్వహణ అధికారి ఏ.శ్రీధర్ సిద్దవటం పోలీసులు శివప్రసాద్‌రెడ్డి, జ్యోతి వెంకట సుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, అర్చకులు సుబ్రమణ్యంశర్మ, వంతాటిపల్లె గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం షాపులో సీసీ ఫుటేజీ పరిశీలన



వైన్‌షాపులో సీసీఫుటేజిలను పరిశీలిస్తున్న ఎస్ఐ మహమ్మద్‌రఫీ, పోలీసులు

సిద్దవటం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాకరాపేట గ్రామ సమీపాన ఉన్న శ్రీకృష్ణ వైన్ షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగిందని ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ భాకరాపేట గ్రామ శివారులో ఉన్న శ్రీకృష్ణ వైన్‌షాపును పరిశీలించామన్నారు. అక్కడున్న ప్రొప్రైటర్ రామసుబ్బారెడ్డిని విచారించగా మద్యం షాపులో 30 వేలు విలువ గల మద్యం బాటిళ్లు, క్యాష్‌కౌంటర్‌లో ఉన్న రూ.5 వేల నగదును దొంగలించారన్నారు. దీంతో బ్రాందీషాపులో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించామన్నారు. గుర్తు తెలియని వ్యక్తి షాపు ఉన్న తాళాలను పగులగొట్టి మద్యం బాటిళ్ల అట్ట ముఖానికి అడ్డుపెట్టుకుని లోపలికి ప్రవేశించాడన్నారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న నగదుతో పాటు మద్యం బాటిళ్లు తీసుకెళ్లినట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయిందని రామసుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలి

● నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరాజు

రాయచోటిటౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను కేటాయించిందని, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులన్నీ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని నోబెల్ టీచర్స్ అసోసియషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి పట్టణంలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్‌టీఏ ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులన్నీ సెకండరీ ఉపాధ్యాయులతోనే భర్తీ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ, ఆ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్మెంట్‌కు (డీఎస్సీ)కి కూడా కేటాయిస్తున్నారనే సమాచారం రావడం బాధాకరమన్నారు. అలాగే మోడల్ ప్రాథమిక పాఠశాలలకు కేటాయించిన ప్రధానోపాధ్యాయుల పోస్టులను వందశాతం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని కోరారు. ఎన్‌టీఏ ముఖ్య నాయకులు రామాంజులు, పక్కీరా, కులశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఆర్‌వీ రమణ, రాజేంద్రనాయుడు, ఆరీఫుల్లా, వెంకట్రామరాజు, శ్రీనివాసులు, నాగేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి: డీఈ

నిమ్మనపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆర్ డబ్ల్యూఎస్ డీఈ రెడ్డెప్ప అన్నారు. సోమవారం ఆయన పది రోజుల క్రితం మండలంలో వేసిన తాగునీటి బోర్లను, మురుగునీటి కాలువలను పరిశీలించారు. అనంతరం అగ్రహారం పంచాయతీలో రూ.5లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ పనులను పరిశీలించి త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ మిథున్ చక్రవర్తి, ఎంసీవో గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ఎన్నటికో...

- శిలాఫలకానికే పరిమితమైన ఇండోర్ స్టేడియం
- క్రీడాకారులకు తప్పని ఇక్కట్లు
- కార్యరూపం దాల్చని నేతల హామీలు
- మంజూరైన నిధులు రద్దు



పీలేరులో ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం శిలాఫలకం వేసిన జూనియర్ కళాశాల క్రీడామైదానం

పీలేరురూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ విద్య, వ్యాపార కేంద్రంగా దినదినాభివృద్ధి సంతరించుకుంటున్న పీలేరు పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం ప్రశ్నార్థకంగా మిగిలింది. అదిగో ఇదిగో అంటూనే దశాబ్దాలు గడిచిపోతున్నా స్టేడియం నిర్మాణం కార్యరూపం దాల్చడం లేదు. దీంతో క్రీడాకారులు ఉసూరుమంటున్నారు. క్రీడామైదానాల్లో కనీస వసతులు కానరావడం లేదు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా మౌలిక వసతుల కల్పన ఆమడ దూరంలో ఉండడంతో సర్వత్రా నిరుత్సాహం నెలకొంది. కనీసం క్రీడల నిర్వహణకు అవసరమైన సామగ్రి సైతం అందుబాటులో ఉండడం లేదు. మరోవైపు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సహకారం అంతంత మాత్రంగానే ఉండడం శోచనీయం.

శిలాఫలకానికే పరిమితం...

పీలేరు పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం 14 సంవత్సరాలుగా శిలాఫలకానికే పరిమితమైంది. 2011 జూలై 22న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శిలాఫలకం వేశారు. స్టేడియం నిర్మాణానికి రూ.2.10 కోట్లు నిధులు మంజూరు చేశారు. పీలేరుతో పాటు కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురంలో ఇండోర్ స్టేడియాల నిర్మాణం కోసం శిలాఫలకం వేయడంతో పాటు రూ.8.40 కోట్లు నిధులు మంజూరు చేశారు. దీంతో ఈ ప్రాంత క్రీడాకారులు, విద్యార్థులు ఎంతో సంబరపడ్డారు. స్టేడియం నిర్మాణం అదిగో ఇదిగో అంటూనే ఏళ్లు గడిచిపోయాయి. ఇప్పటి వరకూ ఎటువంటి నిర్మాణ పనులు కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం. పలుమార్లు స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ అథ్లటిక్ అసోసియేషన్ (శాప్) అధికారులు పీలేరుతో పాటు నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాలలోని క్రీడా మైదానాలను పరిశీలించారు. అయినా ప్రయోజనం లేకపోయింది.

నిర్మాణం పూర్తై ఉంటే...

ఇండోర్ స్టేడియం నిర్మాణం కార్యరూపం దాల్చి ఉంటే షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, రన్నింగ్ ట్రాక్, బాల్ బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్ తదితర క్రీడల నిర్వహణకు ఎంతో సౌకర్యంగా ఉండేదని క్రీడాకారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. ఇండోర్ స్టేడియం నిర్మాణంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొనవచ్చని సంబరపడ్డారు. అలాగే వీరితో పాటు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ స్థాయి పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు అనేక మంది ఉన్నారు. రన్నింగ్ ట్రాక్ నిర్మాణంతో అథ్లెటిక్స్‌కు ఎంతో దోహదపడేది.

పట్టించుకోని ప్రభుత్వాలు...

అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఇండోర్ స్టేడియం నిర్మాణం గూర్చి పట్టించుకోకపోవడంతో పనులు అటకెక్కాయి. మంజూరైన నిధులు సైతం రద్దు కావడంతో క్రీడాకారులకు కనీస వసతులకు నోచుకోవడం లేదు. ఏళ్లు గడుస్తున్నా అధికారంలోకి వచ్చిన పాలకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి.

విద్యార్థులకు తప్పని ఇక్కట్లు...

శిలాఫలకాలకే ఇండోర్ స్టేడియాల నిర్మాణం పరిమితం కావడంతో విద్యార్థులకు సైతం ఇక్కట్లు తప్పడం లేదు. పీలేరు మండలంలో సుమారు 14 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఐదు గురుకుల పాఠశాలలు, బాలురు, బాలిక జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అయితే పీలేరు మినహా ఎక్కడా ఆశించిన మేరకు క్రీడా మైదానాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు క్రీడాకారులు, విద్యార్థుల ఇక్కట్లు గుర్తించి ఇండోర్ స్టేయాల నిర్మాణంపై ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నారు.

క్రీడల ప్రాముఖ్యతను గుర్తించాలి



క్రీడల ప్రాముఖ్యతను గుర్తించి ప్రభుత్వం ఇండోర్ స్టేడియం నిర్మించాలి. విద్యార్థులకు కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. మెరుగైన వసతులు కల్పించి క్రీడాకారులను ప్రోత్సహించాలి. మెరుగైన వసతులు లేనందున ప్రతిభ కలిగిన క్రీడాకారులు నష్టపోయే ప్రమాదం ఉంది.

- చంద్రమౌళి, ఫిజికల్ డైరెక్టర్, పీలేరు

మెరుగైన వసతులు కల్పించాలి



ప్రభుత్వాలు ఏవైనా పేద క్రీడాకారుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని మెరుగైన వసతులు కల్పించాలి. క్రీడల పట్ల ఆశక్తి ఉన్నా వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులతో పాటు క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఇండోర్ స్టేడియం నిర్మాణంతో క్రీడాకారులకు ఎంతో ఉపయోగం.

-మస్తాన్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, పీలేరు

క్షయవ్యాధి రహిత జిల్లాగా రూపొందించడమే లక్ష్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాను క్షయ వ్యాధి రహితంగా రూపొందించడమే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ క్షయ వ్యాధి పట్ల శ్రద్ధ వహించాలన్నారు. టీబీ రహిత భారత్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రామ్‌ను మన జిల్లాలో నేటి నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. ప్రాథమిక దశలోనే టీబీ వ్యాధిని నిరోధించడం, క్షయ వ్యాధి వలన కలిగే మరణాలను తగ్గించడం, 2027 సంవత్సరం నాటికి భారతదేశంలో క్షయవ్యాధిని నిర్మూలించడం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

నిక్షయ మిత్ర పథకానికి విరాళాలివ్వండి

టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు నుంచి 8 నెలల పాటు పోషకాహారం అందించడానికి నిక్షయ మిత్ర పథకానికి విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. నెలకు రూ.500 నుంచి రూ.700 వరకు, అలా ఆరు నెలలకు రూ.3 వేల నుంచి రూ.4200 వరకు ఒక్కొక్క టీబీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సహాయం అందించేందుకు రావాలన్నారు.

ఉదారత చాటుకున్న కలెక్టర్, జేసీ

జిల్లాలో నేటి నుంచి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఒక్కొక్కరు ముగ్గురు క్షయ వ్యాధి గ్రస్తులను దత్తత తీసుకొని వారి పోషకాహారం కోసం తమ సొంత నిధుల నుంచి రూ.10 వేలు అందించారు. అలాగే డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాసులు ఒక్కొ క్కరు ఇద్దరు చొప్పున దత్తత తీసుకుని రూ.5 వేలు అందించారు. జిల్లా అధికారులు కూడా స్వచ్ఛంగా ముందుకు వచ్చి తమవంతుగా తోచిన మేరకు ఆర్థిక సహాయం అందించి క్షయ రహత జిల్లా కోసం కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు డిప్యూటీ తహసీల్దార్‌పై జేసీకి ఫిర్యాదు

● రాయచోటి ఆర్డీవోను విచారణకు ఆదేశించిన జేసీ



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న సుధీర్‌కుమార్

గాలివీడు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దళితుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బోరు బావి తవ్విన పుల్లారెడ్డిగారిసుబ్బారెడ్డి దళిత కుటుంబానికి వ్యతిరేకంగా విధులు నిర్వహిస్తు బంధు ప్రీతితో వ్యవహరించిన గాలివీడు మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డిపై విచారణ జరిపించి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ ఫిర్యాదు చేశారు. జేసీ స్పందిస్తూ రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులును విచారణకు ఆదేశించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ మాట్లాడుతూ గాలివీడు మండలం చీమలచెరువుపల్లె పంచాయతీ కడపవాండ్లపల్లె దళిత కులానికి చెందిన ధారా వెంకట్రమణకు సర్వే నెంబర్ 973/3లో మూడు ఎకరాలు, సర్వే నెంబర్ 2985/1లో ఒక ఎకరా 14 సెంట్లు వ్యవసాయ సాగు భూమి ఉందని తెలిపారు. వరి భూమి పక్కనే చీమలచెరువుపల్లె పంచాయతీ ఎర్రదొడ్డిపల్లెకు చెందిన పుల్లారెడ్డిగారి సుబ్బారెడ్డికి, వారి బంధువులకు భూమి ఉందని తెలిపారు. అయితే సర్వే నెంబర్ 973/3ను ఆనుకుని 50 సెంట్లు విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ భూమి ఉండగా గత 30 సంవత్సరాల క్రితం నుండి ధారా వెంకట్రమణ తయారు చేసుకుని తన అనుభవంలోనికి తెచ్చుకుని చెరువులు నిండిన సందర్భంలో వరి పంటను పెట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో గత ఆరు నెలల క్రితం వెంకట్రమణ కుమారుడు మానసిక వ్యాధికి గురికావడంతో బెంగళూరులో చికిత్స తీసుకోవడాన్ని ఆసరా చేసుకున్న సుబ్బారెడ్డి ఎటువంటి అనుమతులు లేకుండా దళితుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూమిలో దౌర్జన్యంగా బోరుబావిని తవ్వాడన్నారు. అంతేగాక వెంకట్రమణ ఏర్పరుచుకున్న హద్దులను సైతం చెరిపేసి అందులోకి వెళ్లనివ్వకుండా బెదిరించాడన్నారు. ఈ విషయమై వెంకట్రమణ గాలివీడు మండల తహసీల్దార్, జాయింట్ కలెక్టర్, కలెక్టర్లకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గాలివీడు మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డికి, ఆక్రమణదారుడు సుబ్బారెడ్డికి బంధుత్వం ఉన్న నేపథ్యంలో విచారణ పేరుతో ఫీల్డ్‌కు వెళ్లి వెంకట్రమణ ఫిర్యాదును ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. వెంకట్రమణ అమ్మ పేరున సర్వే నెంబర్ 2985లో ఉన్న భూమిని సర్వే చేయించి 8 మామిడి చెట్లు సుబ్బారెడ్డికి చెందేవిధంగా నిర్ణయించి దళితులకు అన్యాయం చేశారన్నారు. కావున దళితుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాజేయడానికి కుట్ర పన్నిన సుబ్బారెడ్డి మీద, బంధు ప్రీతితో సుబ్బారెడ్డికి అనుకూలంగా దళితులకు వ్యతిరేకంగా వ్యవహరించి ప్రభుత్వ విధులను దుర్వినియోగ పరిచిన గాలివీడు మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళితుడు వెంకట్రమణ, అతని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మళ్లీ రాబోయేది టీడీపీ ప్రభుత్వమే: ఎమ్మెల్యే నల్లారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మేలు చేకూర్చే పనులు చేపట్టాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగించడంలో సీఎం చంద్రబాబు, నారా లోకేష్ విజయవంతంగా ముందుకెళుతున్నారని ఆయన చెప్పారు. పార్టీకి, ప్రజలకు అంకితభావంతో సేవలు చేసిన వారికి పదవులు వరిస్తాయన్నారు. కలికిరి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మాలతి, వైస్ చైర్మన్‌గా సనావుల్లాతో పాటు మొత్తం పాలకవర్గం సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో జరిగిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరైనా ప్రజల అభిమానాన్ని సంపాదిస్తేనే పదవుల్లోకి వస్తారని, అధికారముండేది పెత్తనం చేయడం కోసం కాదని, ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ముందుగా చైర్ పర్సన్‌గా మాలతి, వైస్ చైర్మన్‌గా సనావుల్లా, డైరెక్టర్లుగా కలికిరి, కలకడ మండలానికి చెందిన పి.తేజకుమార్, సి.అస్లామ్, బి.వసంత, వీఎస్ మెహర్ బాను, పి.రెడ్డెమ్మ, ఎం.శ్యామల, ఇ.శ్రీనివాసవర్మ, కె.రెడ్డెమ్మ, టి.నరసమ్మ, ఎం.రాజగోపాల్ రెడ్డి, ఎస్.ముబారక్ ఆలీ, ఎస్.విశ్వనాథం శెట్టి, సి.రాంబాబు, సర్పంచు విశ్వనాథ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. పలువురు నాయకులు పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నల్లారి చంద్రకుమార్ రెడ్డి, మాజీ సర్పంచు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి, టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, యోగేష్ రెడ్డి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం మండల టీడీపీ నాయకులు నౌషద్, జయసూరి, చిట్టి, రవిప్రకాష్ పాల్గొన్నారు.

కలికిరి సంతలో దొంగ నోటు



బయటపడ్డ ఐదు వందల నకిలీ నోటు

కలికిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సోమవారం కలికిరి సంతలో ఒక ఐదు వందల రూపాయల నకిలీ నోటు చలామణి జరిగింది. అయితే అది పూర్తిగా దొంగనోటు కాదు.. కానీ ఎవరో ఒక మహిళా వ్యాపారికి ఇవ్వడంతో ఆమె మోసపోయింది. అచ్చు ఒరిజినల్ నోటు మాదిరిగానే వుండటంతో చదువురాని ఆ మహిళ సులభంగా మోసానికి గురైంది. సంతలో నన్నారి సోడా బండి పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్న ఒక మహిళ దగ్గర సోడా తాగి రూ.ఐదు వందల నోటు ఇచ్చాడు. దీన్ని మడత పెట్టి ఇవ్వడంతో ఆమె గమనించకోకుండా చిల్లర ఇచ్చేసింది. ఆ తరువాత చూసుకుంటే అది చిన్న పిల్లలు ఆడుకునే నోటుగా తేలింది. దాని మీద చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని స్పష్టంగా వున్నా ఆమె గమనించకుండా మోసపోయింది. విషయం తెలియడంతో అక్కడ జనం పోగయి, మోసగాడి కోసం గాలించారు. అప్పటికే అతడు ఉడాయించడంతో ప్రజలు, వ్యాపారులు అప్రమత్తమయ్యారు.

'పెన్షనర్లు పే స్లిప్‌లు పరిశీలించుకోవాలి'

కలికిరి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ అయిన ఉద్యోగులు తమ పెన్షన్లకు సంబంధించిన పే స్లిప్పులను పరిశీలించుకోవాలని రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యదర్శి సురేంద్రరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మే నెలకు సంబంధించిన పేమెంట్ స్లిప్పులు కొత్త విధానంలో జనరేట్ అయ్యాయని, వాటిని డౌన్‌లోడ్ చేసుకుని పలు రకాల వివరాలను పరిశీలించుకోవాలన్నారు. డౌన్‌లోడ్ చేసిన పెన్షన్ స్లిప్పులో పెన్షనరు పేరు, పుట్టిన తేదీ తదితర పలురకాల వివరాలు సక్రమంగా వున్నాయో లేదో బేరీజు వేసుకోవాలని చెప్పారు. వయసు 70 ఏళ్లు దాటిన పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు అదనపు క్వాంటమ్ మొత్తం కలిసిందా లేదా అని పరిశీలించాలన్నారు. కమ్యుటేషన్ ఎప్పుడు చెల్లించారు? రికవరీ ప్రారంభ తేదీ వివరాలు కూడా ఈ కొత్త రకం పే స్లిప్పులో పొందుపరిచారని చెప్పారు. గతంలో 2024 నవంబరు నుంచి 2025 ఏప్రిల్ వరకు కమ్యూటేషన్ రికవరీ ఆరు నెలల పాటు నిలుపుదల చేసిన వారందరి నుంచి హైకోర్టు తీర్పు మేరకు 12 వాయిదాలలో తిరిగి రాబట్టుకోవడం ఈ నెల నుంచి ప్రారంభించినట్లు గమనించాలని కోరారు. వారి నుంచి ఈ నెల నుంచి రెగ్యులర్ కమ్యుటేషన్‌తో పాటు రికవరీ వాయిదాలను కలిపి ఈ నెల నుంచి మినహాయిస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. భార్యా భర్తలు ఇరువురూ సర్వీసు పెన్షన్ పొందుతున్నట్లయితే ఈహెచ్ఎస్ నెలవారీ చందాను ఒకరికి మాత్రమే మినహాయిస్తే సరిపోతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ స్కేల్ పొందేవారికి డీఆర్ 33.67 శాతం, యూజీసీ స్కేల్ పొందే వారికి 46 శాతం డీఆర్‌లు పేమెంట్ స్లిప్పులో గమినించాలని కోరారు. పెన్షనర్లు ఏ ట్రెజరీ ద్వారా పెన్షన్ పొందుతున్నారో దాని ఎస్‌టీవో యొక్క డీడీవో కోడ్ కూడా నమోదయి వుంటుందని గమనించాలని సురేంద్ర రెడ్డి వివరించారు.

'అవినీతి ఆర్ఐపై చర్యలు తీసుకోవాలి'

తంబళ్లపల్లె, జూన్ 2(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, లంచం లేనిదే పనులు చేయని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు గంగరాజు సుధాకర్, రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని పలు గ్రామాల బాధిత రైతులు ప్లకార్డులతో తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వే తప్పుల తడకగా ఉందని, వెంటనే రీ సర్వేను రద్దు చేసి కొత్తగా చేపట్టాలన్నారు. ప్రజలకు, రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో రైతులు చలపతినాయుడు, వెంకట మల్లప్ప, వాసు, నిరంజన్‌రెడ్డి, రమేష్, శ్రీధర్, ఫక్రుల్లా, రమణయ్య, వెంకట్రమణ తదితర రైతులు పాల్గొన్నారు.

బయోత్పాతం

- గాడితప్పిన జీవవ్యర్థాల నిర్వహణ
- చెత్తలో కలిపేస్తున్న బయో వేస్టేజీ
- పారిశుధ్య కార్మికుల ప్రాణాలతో చెలగాటం

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కాసుల కక్కుర్తితో కొన్ని ఆస్పత్రులు పట్టణవాసుల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నాయి. పర్యావరణం ప్రజా ఆరోగ్యం పాలిట ముప్పుగా మారిన జీవ వ్యర్థాల (బయో మెడికల్ వేస్టేజీ) నిర్వహణ ప్రొద్దుటూరులో దారుణంగా తయారైంది. చెత్తతోపాటు బయో వేస్టేజీని కలిపి మున్సిపల్ కార్మికుల చేతికి అందిస్తున్నారు. బయో వ్యర్థాలపై అవగాహన, దాని ప్రమాదస్థాయి తెలియని అభం, శుభం ఎరుగని పారిశుధ్య కార్మికులు వీటిని సాధారణ చెత్తలో కలిపి తీసుకెళుతున్నారు. జిల్లాలోని చాలా ప్రాంతాలకు చెందిన ప్రైవేటు ఆస్పత్రులలో నెలకొన్న ఈ జాడ్యంపై అధికారుల క్షేత్ర పరిశీలన లోపించింది.

ప్రొద్దుటూరు పట్టణంలో దాదాపు 130 వరకు చిన్న, పెద్ద క్లీనిక్‌లు, ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్‌హోంలు, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులతోపాటు మెడికల్ బ్లడ్‌ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు ఉన్నాయి. ఈ ఆస్పత్రుల నుంచి వెలువడే వేస్టేజీలను తీసుకెళ్లేందుకు ఒక్కో ఆస్పత్రుల్లో ఒక్కో బెడ్డుకు కొంత డబ్బును బయోవేస్టేజీ సంస్థ వసూలు చేస్తుంది. అయితే బయో వేస్టేజీ తరలించే వాహనాన్ని పరిశీలిస్తే.. సేకరణ అయ్యే వేస్టేజీకి, ఆస్పత్రుల సంఖ్య వాటి నుంచి వెలువడే వ్యర్థాలకు పొంతన లేకుండాపోతోంది. బయో వేస్టేజీ నిర్వహణ సంస్థకు చెల్లించే డబ్బులకు కక్కుర్తిపడో లేక బయోవ్యర్థాలపై నిర్లక్ష్యమో కొంతమంది ఆస్పత్రి నిర్వాహకులు వేస్టేజీలను ఇవ్వకుండా మున్సిపల్ చెత్త తీసుకెళ్లే పారిశుధ్య కార్మికుల చేతికి అందిస్తున్నారు. మున్సిపల్ చెత్త తీసుకెళ్లే ట్రాక్టర్లలో చెత్తతోపాటు బయో వేస్టేజీలను వాహనంలో పడవేయడంతో డంపింగ్‌యార్డులకు తరలివెళుతోంది. బయో

అవగాహన కల్పిస్తాం...

బయోవ్యర్థాలు మునిసిపల్ చెత్తలో కలిసేందుకు వీల్లేదు. అలాంటి వాటిపై దృష్టి సారిస్తాం. బయోవేస్టేజీపై మునిసిపల్ కార్మికులలో అవగాహన కల్పిస్తాం. సాధారణ చెత్తలో ఈవేస్టేజీ చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

వి. మల్లికార్జున,
మునిసిపల్ కమిషనర్,ప్రొద్దుటూరు.

తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం

ఆసుపత్రుల నుంచి వెలువడే బయోవ్యర్థాలను శ్రీవెన్ ఎన్విరాన్ టెక్నాలజీస్‌కు అందించాలి. బయోవ్యర్థాల నిర్వహణ కచ్చితంగా పాటించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారి సమాచారం అందిస్తే.. అలాంటి ఆసు పత్రులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

-అనిల్, ఏఈ, ఏపీ పొల్యూషన్
కంట్రోల్ బోర్డు, కడప



ప్రైవేటు ఆసుపత్రుల నుంచి సేకరిస్తున్న వ్యర్థాలతో కూడిన సంచులు

వేస్టేజీలలో సుమారు 30 నుంచి 40 శాతం మునిసిపల్ చెత్తలో కలుస్తోందని స్వయంగా కొంత మంది వైద్య రంగానికి చెందిన నిపుణులు చెప్పడం గమనార్హం.

ఆరోగ్యంతో చెలగాటం

జీవ వ్యర్థాలకు సంబంధించిన బట్టలు, మానవ అవయవాలు, సూదులు, ఇతర రకాల బయో వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు పట్టుకోవడం వలన వారికి తెలియకుండానే వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. ఎంత ప్రమాదమో పారిశుధ్య కార్మికులకు అవగాహన లేకపోవడం వలన ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మున్సిపల్ కార్మికులు తెలియకుండానే ప్రాణాలమీదకు తెచ్చుకునే పరిస్థితి కనిపిస్తోంది. మున్సిపల్ అధికారులు పారిశుధ్య కార్మికులకు అసలు బయో వేస్టేజీల వలన ఎదురయ్యే అనేక ప్రమాదాలపై, వ్యాధులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. బయో వేస్టేజీ మున్సిపల్ సాధారణ చెత్తలో కలిపి డంపింగ్‌యార్డుకు చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. కాసులకు కక్కుర్తిపడే కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, క్లీనిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు చూపిస్తున్న అశ్రద్ధ వ్యవహారంపై

నిబంధనల ప్రకారం

బయో మెడికల్ వేస్టేజీల నుంచి ప్రమాదకరమైన బ్యాక్టీరియా, వైరస్ వెలువడుతుంది. వీటిని నిర్దేశిత కవర్లలో భద్రపరచి 48 గంటల లోపు కామన్ బయోమెడికల్ వేస్టేజీ ట్రీట్‌మెంట్ ఫెసిలిటి (విచ్చిన్న) కేంద్రాలకు తరలించాలి. ఆంధ్రప్ర దేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు పొందిన అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం దంపెట్ల గ్రామ సమీపంలో శ్రీవెన్ ఎన్విరాన్ టెక్నాలజీస్ వీటి నిర్వహణ చేపడుతోంది. అక్కడి నుంచి ప్రతిరోజు నాలుగు ప్రత్యేక వాహనాలు ఉమ్మడి కడప జిల్లాలోని కడప, పులివెందుల, రాయ చోటి, రాజంపేట, బద్వేలు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు తదితర ప్రాంతాలు తిరుగుతూ ప్రైవేటు ఆసుపత్రులు, క్లీనిక్‌లు, నర్సింగ్‌హోం, డయగ్నోస్టిక్ సెంటర్ల నుంచి బయో వ్యర్థాలను సేకరిస్తున్నారు. ఈ వేస్టేజీని తీసుకెళ్లేందుకు ఆస్పత్రిలో ఉన్న ఒక్కో బెడ్డుకు కొంత డబ్బులను (పడకల స్థాయిని బట్టి) నెలకు రూ. 2వేలు చొప్పున బయో వేస్టేజీ కోసం ఆయా సంస్థలు వసూలు చేస్తుంటాయి. శ్రీవెన్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీస్ సంస్థ బయోవేస్టేజీలను తీసుకెళ్లి అక్కడ ప్రభుత్వం నిర్దేశించిన పద్ధతులతో వాటిని నిర్వీర్యం చేస్తారు. తర్వాత బయో వేస్టేజీల వలన ఉత్పన్నం అయ్యే ఎటు వంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాపించకుండా కట్టడి చర్యలు చేపడుతారు. వ్యర్థాలను వేసి ఉంచేందుకు కావలసిన కవర్లను కూడా ఈ సంస్థే అందిస్తుంది. పసుపు రంగు కవరులో మానవ శరీర అవయవాలు, రక్తంతో కూడిన భాగాలు, ప్రయోగ శాల వ్యర్థాలు... ఎరుపు రంగు కవరులో రక్తంతో ఉన్న సామగ్రి, కాటన్ డ్రెస్సింగ్ మెటీరియల్, ప్లాస్టర్లు, సిరంజీలు, ప్లాస్టిక్ వ్యర్థాలు.. నలుపు రంగు కవరులో కాలం చెల్లిన ఔషధాలు, సూదులు, బ్లేడ్లు, ఇతర పదునైన వస్తువులు.. నేరేడు రంగు కవరులో క్యాన్సర్ కారక మందులు, వీటి వ్యర్థాలు ఉంచి భద్రపరచాలి.

కాలుష్య నియంత్రణ మండలి నిఘా పెంచి చర్యలు తీసుకోవాల్సి ఉంది.



బయో వేస్టేజీ అంటే.....

సాధారణంగా ఆస్పత్రుల నుంచి వచ్చే మాంసపు, శరీర అవయవాలు, రక్తంతో కూడుకున్న భాగాలు, కాటన్, డ్రస్సింగ్ మెటీరియల్, ప్లాస్టర్లు, పనికిరాని, కాలం చెల్లిన ఔషధాలు, వాడి పడేసిన సూదులు, బ్లేడ్లు, తదితరాలను జీవవ్యర్థాలుగా వ్యవహరిస్తుంటారు. వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ పడవేయకూడదు. వీటి నుంచి ప్రమాదకరమైన బ్యాక్టీరియా, వైరస్, గాలిలోకి చేరుతుంది. 48 గంటల లోపు విచ్చిన్న కేంద్రాలకు ఈ వేస్టేజీలను తరలించాలి. వీటిని తాకినా, నేరుగా ముట్టుకున్నా తద్వారా పలు ప్రాణాంతక వ్యాధులకు గురికాకతప్పదు.

ఆసుపత్రిలలో వెలువడే బయోవ్యర్థాలు (నమూనా చిత్రం)

నెల్లూరు, చిత్తూరు జట్ల విజయభేరి



నిఖిలేశ్వర్‌రెడ్డి, నెల్లూరు 83 పరుగులు



లోహిత్, చిత్తూరు 84 పరుగులు

కడప స్పోర్ట్స్, జూన్ 2 (ఆంధ్ర జ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-23 పురుషుల అంతర్‌జిల్లాల వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా సోమవారం నెల్లూరు జట్టు కర్నూలు జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో చిత్తూరు జట్టు కడప జట్టుపై విజయం సాధిం చింది. వివరాలిలా.. వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు- కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ చేపట్టి 49.4 ఓవర్లలో 387 పరుగుల భారీస్కోర్ సాధించి ఆలౌట్ అయింది. ఇందులో నిఖిలేశ్వర్‌రెడ్డి 83 పరుగులు, మన్విత్‌రెడ్డి 67, సోహన్‌వర్మ 62 పరుగులు చేసి భారీ స్కోర్‌కు బాటలు వేశారు. కాగా బౌలింగ్ విభాగంలో కర్నూలు బౌలర్ ఖానిష్ 5 వికెట్లు పడగొట్టాడు. తదనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు కేవలం 26.3 ఓవర్లలో 162 పరుగుల స్వల్ప స్కోర్‌కే అన్ని వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది. ఇందులో ఖానిష్ 60 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో నెల్లూరు బౌలర్ భార్గవ్ 5 వికెట్లు సాధించి నెల్లూరు జట్టుకు భారీ విజయాన్ని అందించారు.

కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో కడప-చిత్తూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 261 పరుగులు చేసింది. ఇందులో శివకేశవ 63 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 49.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 264 పరుగులు చేసి విజయభేరి మోగించింది. ఇందులో లోహిత్ 84 పరుగులు చేయగా నిఖిత్‌గౌడ్ 54 పరుగులు చేసి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించారు.

క్షయవ్యాధి నిర్మూలనకు సత్వర చర్యలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో నాగరాజు

కడప కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు నిర్ధారణ పరీక్షలు ముమ్మరంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. టీబీ యాక్ట్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్‌టెన్సిఫైడ్ టీబీ క్యాంపస్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో ఉన్న షుగర్ వ్యాధిగ్రస్థులు, ఆల్కహాల్, పొగ తాగువారు, పొగాకు ఉత్పత్తులు వాడే వారితోపాటు 60 సంవత్సరాలు పైబడిన వారికి నిర్ధారణ పరీక్షలు తప్పక చేయాలన్నారు. క్షయ అంటు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు తగిన జాగ్రత్తలు సూచించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ రవి బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎన్‌ఐఈపీ సిబ్బంది పాల్గొన్నారు.

దేవదాయ కమిషనరుపై ఎమ్మెల్సీ ఆగ్రహం



దేవదాయ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాలరెడ్డి

కడప, కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దూప, దీప నైవేద్యాలకు సంబంధించిన ఫైళ్ల ప్రభుత్వానికి పంపే విషయంలో దేవదాయ శాఖ కమిషనర్ నిర్లక్ష్యంపై ఎమ్మెల్సీ రాంగోపాలరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌కు వచ్చిన ఆయన దేవదాయశాఖ కమిషనరు మురళీతో మాట్లాడుతూ జిల్లాలో గత జనవరి నెలలో పెట్టిన ఫైళ్లను ఇంత వరకు ఉన్న తాధికారులకు ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. ఇంత నిర్లక్ష్యంగా పని చేస్తే ఇంటికి సాగనంపుతానంటూ హెచ్చరించారు. ఏదైనా అర్జీ పెడితే సమాధానం లేదని మండిపడ్డారు. మాలాంటోళ్లకే సక్ర మంగా పలకడం లేదు. సామాన్యులకు ఏం పలుకుతావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన ఫైళ్లకు వెంటనే సమాధానం లేక పోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇంటి పంపడం ఖాయమని హెచ్చరించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ హవా



విద్యార్థులతో నారాయణ కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ-అడ్వాన్స్‌డ్-2025 ఫలితాలలో కడప నారాయణ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆలిండియా స్థాయిలో డి.సాత్విక 892వ ర్యాంకు, జె.ఐశ్వర్యారాజ్ 1133, బి.వెంకట రామ్‌చరణ్ 1449, టి.రోహిత్‌రెడ్డి 1646, ఎన్.ధనుష్ 1733, సి.ధీరజ్‌కుమార్ 1962, సి.నితిన్‌రెడ్డి 2627, ఎస్.అబ్దుల్ హసీమ్ 3199, పి.ప్రణతిరెడ్డి 4323, బి.జగత్‌స్మరన్ 5704, శ్రావణ్‌కృష్ణ 14701, ఎస్.ఉమర్ ఖైయుమ్ 17356, ఇ.మహమ్మద్ హాసన్ 19400 ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థుల పట్టుదల తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో ఈ ఘన విజయం సాధించామని తెలిపారు. అనంతరం నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, డీన్స్ సుబ్బారావు, బాల వెంకట రెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాల్స్ మురళీమోహన్, వెంకటస్వామి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, రాఘవరెడ్డి, సుమన్ విద్యార్థులను అభినందించారు.

పోరుమామిళ్ల విద్యార్థికి 112వ ర్యాంక్



పోరుమామిళ్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో పోరుమామి ళ్లలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థి సుమన్ సుకుమార్‌రెడ్డి ఆలిండియా ఇంజనీరింగ్ విభాగంలో 112వ ర్యాంక్ సాధించాడని కరస్పాండెంట్ పాండురంగారెడ్డి తెలిపారు. అలాగే శశికుమార్ 1122 ర్యాంక్ సాధించాడని ఆయన తెలిపారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా నూతన అధ్యక్షుడిగా హరికిశోర్‌రెడ్డి



మాట్లాడుతున్న మునగా సతీష్‌కుమార్

కడప మారుతీనగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నగర కో-ఆపరేటివ్ కాలనీలోని సాయిబాబా అనాధ శరణాలయ ప్రాంగణం సాయిసదన్ ఫంక్షన్ హాలులో సోమవారం ఛాంబర్‌ఆఫ్ కామర్స్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా హరికిశోర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్స్‌గా మేడా జనార్ధన్ రావు, కె.రామమూర్తి (కడప రీజియన్), ఎస్. గోపాలకృష్ణ, శివకుమార్‌రెడ్డి (ప్రొద్దుటూరు రీజియన్), కార్యదర్శిగా మునగా సతీష్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా పి.వెంకట వంశీకృష్ణనాయుడు (కడప రీజియన్), జాకీర్ అహ్మద్ (ప్రొద్దుటూరు రీజియన్), ట్రెజరర్‌గా కోటా జనార్ధన్‌రావుతో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా మరో 11 మంది ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీ మూడు సంవత్సరాలు కొనసాగుతుంది. నూతన కమిటీకి జిల్లా వ్యాపారులు అభినందనలు తెలిపారు.

గొలుసు దొంగలు అరెస్టు

ప్రొద్దుటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక త్రీటౌన్‌పోలీసు స్టేషన్‌లో విలేకరులతో సీఐ మాట్లాడుతూ ప్రొద్దుటూరు టౌన్ బొల్లవరం వెంకటేశ్వర స్వామి గుడి దగ్గర రాయల్ కౌంటి వద్ద ఒంటరిగా వెళుతున్న మహిళ మెడలో మే 26 తేదీ గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటనలో మైదుకూరు పట్టణం సరాయిపల్లె రోడ్డుకు చెందిన మర్రిజాషువా, మైదుకూరు టౌన్ సాయినాథపురానికి చెందిన మర్రి జయప్రకాష్‌లను సోమవారం స్థానిక సుందరాచార్యుల వీధిలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి సూమారు 45 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు తెలిపారు. ఈచోరీ కేసులో దొంగలను పటుకున్నందుకు త్రీటౌన్ ఎస్‌ఐలు హనుమంతు, వెంకటరెడ్డి, ఎఎస్‌ఐ సుబ్బన్న, కానిస్టేబుళ్లు, హోంగార్డులను సీఐ అభినందించారు.

మహిళ నుంచి సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లిన దొంగ

లింగాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోపట్నూతల గ్రామానికి చెందిన నారే సునీత అనే మహిళకు చెందిన సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తి సోమవారం అపహరించారు. వివరాల్లోకెళితే.... సునీత తన కుమార్తెతో కలిసి గ్రామంలో ఉన్న పోస్టాఫీస్‌కు వెళ్లి డబ్బులు కట్టి తిరిగి నడుచుకుంటూ వస్తుండగా చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కొని పరుగెత్తుకెళ్లాడు. అతన్ని పట్టుకునేందుకు గ్రామస్తులు ప్రయత్నించినా సమీపంలోని కొండలోకి వెళ్లి తప్పించుకున్నాడు. ఆ మేరకు సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలుశిక్ష

బద్వేలు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో పట్టు బడిన ముగ్గురు నిందితులకు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్‌కుమార్ నాలుగురోజుల జైలుశిక్ష విధించినట్లు అర్బన్ సీఐ రాజగోపాల్, ఎస్‌ఐ సత్యనారాయణలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

పోట్లదుర్తి పెద్దమ్మ గుడి వద్ద ఉద్రిక్తత



అధికారులతో మాట్లాడుతున్న సీఎం సురేష్‌నాయుడు



ధర్నాకు కూర్చున్న వైసీపీ నాయకులు, తదితరులు

ఎర్రగుంట్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పోట్లదుర్తి పెద్దమ్మ గుడివద్ద సోమవారం ఉద్రిక్తత నెలకొంది. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా చేపడుతున్న ప్రహరీ నిర్మాణాన్ని వైసీపీ నాయకులు మరికొందరితో కలసి అడ్డుకున్నారు. ఈ ఆలయాన్ని అభి వృద్ధి చేసేందుకు ఎంపీ సీఎం రమేష్ సుమారు రూ.90లక్షలు మంజూరు చేయించి కలెక్టర్‌తో అనుమతులు ఇప్పించారు. అయితే ఇక్కడి ఆలయానికి సంబంధించి మొత్తం 3.09 ఎకరాల భూమి ఉండగా ఆక్రమణకు గురైందని.. ఆక్రమణలను తొలగించి ప్రహరీ నిర్మించాలని వైసీపీకి చెందిన సుధాకర్‌రెడ్డి, మరికొందరు సోమవారం ఉదయం ఎక్స్‌కవేటర్‌తో పనులు చేస్తుండగా అడ్డుకున్నారు. సీఎం సురేష్‌నాయుడు పెద్దమ్మ ఆలయంలో తన వర్గీయులతో కలిసి కూర్చున్నారు. అదే సమయంలో వైసీపీకి చెందిన సుధాకర్‌రెడ్డి ఆలయంలోకి వెళ్లారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి తోపులాట జరిగింది. అరుపులు, కేకలతో ఘర్షణ వాతా వరణం నెలకొంది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన వరప్రసాద్‌రెడ్డి ఆలయంలో ఉన్న సురేష్ నాయుడు వర్గీయులపై ఇటుకతో విసిరినట్లు పోలీసులు తెలిపారు. దీంతో సురేష్ నాయుడు వర్గీయులు ఆగ్రహించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాల వారిని పంపి వేశారు. కాగా, ఆలయం వద్ద పనులు మాత్రం జరగుతూనే ఉన్నాయి. అయితే సాయంత్రం 3.50 గంటలకు ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయని, పనులు నిలిపివేయాలని అధికారులు పేర్కొనడంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. కాగా, గ్రామంలో రాత్రి వరకు ఉద్రిక్తంగానే ఉంది. సీఐ నరేష్ బాబు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈవిషయంపై జిల్లా ఎస్పీకి సమాచారం అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీటీ యామిని ఆలయం వద్దకు వెళ్లి ఇరువర్గాల వారితో మాట్లాడినా ఎలాంటి ప్రయోజనం లేదు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పనులు

- జగన్ దేవాదాయశాఖ, ఈవో

పోట్లదుర్తి హనుమనగుత్తి రోడ్డులోని పెద్దమ్మ గుడికి సర్వే నెంబరు 657లో 3.09ఎకరాల భూమి ఉంది. ఇందులో సుమారు 50 ఏళ్ల క్రితమే కొంత ఆక్రమణకు గురైంది. వారందరికి నోటీసులు ఇచ్చాము. వారు కూడా కోర్టుకెళ్లి లాయర్ నోటీసులు ఇప్పించారు. ప్రస్తుతం ఉన్న భూమిలో అభివృద్ధి పనులు చేసేందుకు ఎంపీ సీఎం రమేష్ రూ.90లక్షలు నిధులు కలెక్టర్ ద్వారా కేటాయించారు. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు ఆగిపోయాయి. అనంతరం కోర్టు ఉత్తర్వులు మేరకు విజయవాడ దేవదాయ కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో ఇక్కడ పనులు మళ్లీ మొదలు పెట్టాము. అయితే ఆక్రమణలు తొలగించిన తర్వాతనే పనులు మొదలు పెట్టాలని కొందరు ధర్నా చేస్తున్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పసుపులేటి హరిప్రసాద్‌ను అభినందించిన హరిప్రసాద్



కడప ఎర్రముక్కపల్లె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్త కళల కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ కలి సి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం జరిగిన రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకార వేడుకలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇంటిస్థలాన్ని ఇవ్వాలి



డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

కమలాపురం రూరల్ జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇల్లు, ఇంటిస్థలాలు ఇస్తామన్న మాట నిలబెట్టుకోవాలని సీపీఐ కమలాపురం ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్ అన్నారు. సోమవారం సీపీఐ రాష్ట్రసమితి పిలుపులో భాగంగా ఇంటిస్థలాలు, సాగు భూముల సాధన కోసం సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండో దశ పోరాటానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో కమలాపురం తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం డిప్యూటీతహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి జి.నాగేశ్వర్‌రావు, సీపీఐ కమలాపురం మండల కార్యద ర్శి పల్లా వర ప్రసాద్, దళిత కుల పోరాట సమితి నాయకులు రాయప్ప, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో ప్రధాని చిత్రపటం ఉంచాలి : బీజేపీ



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె, జూన్ 2 (ఆంధ్ర జ్యోతి): రేషన్ షాపుల్లో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఉంచాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ హరినాథ్ రెడ్డికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ వినతిపత్రం అందజేశారు. గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ఉచితంగా రేషన్ ఇస్తోందన్నారు. 2020 కరోనా కారణంగా ఏ ఒక్కరూ పస్తులు ఉండకూడదనే ఉద్దేశంతో దేశ ప్రధాని మోదీ ఉచితంగా బియ్యాన్ని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు కె.రామచంద్రారెడ్డి, రంగారెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మునగలచంద్ర, ఎర్రబోయిన రవియాదవ్, దొంతుసంతోష్, సురేష్, మోహన్, ముంటిమడుగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాలువగా మారుతున్న కేసీ కెనాల్

కేసీ కెనాల్ కాల్వ నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు, గుర్రపుడెక్క

● ఈ వ్యర్థాలు తొలగించేదెప్పుడో..? ● కాల్వనీరు పారేదెప్పుడో..?

కడప క్రైం జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు - కడప కాల్వ కు సంబంధించి (కేసీ కెనాల్) నీరు సమృద్ధిగా పారుతోంది. ఈ కాల్వను నమ్ముకుని రైతులు వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. అయితే ఈ కాల్వ కడప నగరంలోని విజయదుర్గా కాలనీ, ఫాతిమా మెడికల్ కళాశాల వద్ద పారుతుంది. కాల్వలో ఒకప్పుడు దుస్తులు ఉతకడంతో పాటు పిల్లలు, పెద్దలు స్నానాలు సైతం చేస్తుండేవారు. అలాంటి ఈ నీటి కాల్వలో ఇప్పుడు ప్లాస్టిక్



అధ్వానంగా ఉన్న కేసీ కెనాల్

వ్యర్థాలు, గుర్రపుడెక్క ఏపుగా పెరిగింది. కాల్వలో నీరు ఉందా, లేదా అనేది కూడా కనిపించకుండా ఈ వ్యర్థాలు నీటిపై పూర్తిగా కప్పి ఉంది. ఒకప్పుడు పంటలకు ఈ కాల్వ నీళ్లనే ఉపయోగించుంటే ఈకాలువ ఇప్పుడు మురుగుకాల్వగా మారింది. వీటిని శుభ్రత చేసే నాధుడే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ కేసీ కెనాల్‌లో ఉన్న వ్యర్థాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

నగరంలో ఉన్న పెద్దకాల్వల్లోనూ ఇదే పరిస్థితి

పిల్ల కాల్వలే కాదు నగరంలో ఉన్న పెద్దకాల్వల్లో సైతం మురుగునీరు సరిగా పారడం లేదు. ప్లాస్టిక్‌వ్యర్థాలు, స్థానికులు ఇళ్లల్లోని వ్యర్థాలను సైతం కాల్వల్లోనే పడేస్తున్నారు. చెత్త ఎత్తుకపోయే వాహనాలు ఉన్నప్పటికీ కొంత మంది ఈ కాల్వల్లోనే వ్యర్థాలు వేయడంతో చెత్తచెదారం పేరుకుపోయి మురుగునీరు పారకుండా నిల్వఉంటూ దుర్గంధం వెదజల్లుతోంది. ఇళ్ల మధ్యలో ఉన్న ఈకాల్వ వల్ల దోమలు విజృంభిస్తూ స్థానికులు రోగాలపాలవుతున్నారు. అధికారులు ఇలాంటి కాల్వలపై కూడా దృష్టి సారించి పారిశుధ్య పనులతో పాటు కాల్వలో బ్లీచింగ్, ఫాగింగ్ చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు.



కాలువలో ఉన్న చెత్త, గుర్రపుడెక్క

5న కలెక్టరేట్ వద్ద ఆందోళన

కడప సెవెన్‌రోడ్స్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయం వద్ద జూన్ 5న చేపట్టిన ఆందోళనను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా పేర్కొన్నారు. సామాజిక భద్రత చట్టంలో భాగంగా పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చాలి

పులివెందుల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నెరవేర్చాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ చిన్నయ్యకు సీపీఐ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ అర్హులైనపేదలకు పట్టణాల్లో రెండుసెంట్లు,గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణాకి రూ.5లక్షలు, టిడ్కో ఇళ్ల పంపిణీ, సూపర్‌సిక్స్ పథకాల అమలు సత్వరమే చేపట్టాలని డిమాండ్ చేశారు.

మలేరియాపై అవగాహన

వేముల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా మండలంలోని వేల్పుల గ్రామంలో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య దోమకాటు వల్ల కలిగే వ్యాధులను వివరించారు.దోమతెరలు వాడటం వంటి విషయాలను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల తనిఖీ

లింగాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండ్లవాగు గ్రామంలో 2022-23లో రూ.65లక్షల పాడా నిధులతో చేపట్టినఅండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. 2870 మీటర్ల మేర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను గ్రామం లో ఏర్పాటుచేశారు. ఈ పనులనుపరిశీలించారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

వేముల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని తలపెట్టిన యోగాంధ్రను విజయవంతం చేయాలని వెలుగు ఏపీఎం ఆంజనేయులు అన్నారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మహిళా సంఘ సభ్యులను రిజిస్ట్రేషన్ చేసి భాగస్వామ్యులు చేయాలన్నారు. అలాగే జూన్ 27వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన వనం-మనం కార్యక్రమంలో భాగంగా ప్రతి మహిళ రెండు మొక్కలు ఇంటి ఆవరణలో నాటే కార్యక్రమాన్ని డ్వాక్రా మహిళలు విజయవంతం చేయాలని సూచించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక



చెన్నూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని ఉన్నతులుగా తయారయ్యేందుకు కారణమైన పాఠశాలను గుర్తించుకుని ఆ పాఠశాల అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తామని చెప్పడం అభినందనీయమని ఖాజీపేట, నంద లూరు ఎంఈవోలు సత్యనాగరాజు, అనంతక్రిష్ణ అన్నారు. మండ లంలోని కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులు అనంతక్రిష్ణ, సత్యనాగరాజు, నారాయణ, మాధవీలత, రమణను ఘనంగా సన్మానించారు. అలాగే జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వవిద్యార్థులు సుధీర్ కుమార్, సురేంద్ర, నవీన్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన సింహాద్రిపురం విద్యార్థులు



సాయి అనీష్‌రెడ్డి, లిఖిత్‌రెడ్డి

సింహాద్రిపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 పోటీ పరీక్షలలో సింహాద్రిపురానికి చెందిన వెన్నపూస సాయి అనీష్ రెడ్డి ఆల్ ఇండియా 100వ ర్యాంక్, ఎన్. లిఖిత్‌రెడ్డి 512వ ర్యాంక్ సాధించి తమ సత్తా చాటారు. సాయి అనీష్‌రెడ్డి డాక్టర్ శివన్నారా యణరెడ్డి, డాక్టర్ మాధవిరెడ్డి దంపతుల కుమారుడు. సాయి అనీష్‌రెడ్డి 9వ తరగతిలో ఇంటర్నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ ఐఓక్యూజేఎస్ పోటీ పరీక్షల్లో టాప్ 20 ర్యాంక్ సాధించాడు. దీంతో రాజస్థాన్ లోని ప్రముఖ విద్యాసంస్థ అల్లెన్ కెరీర్ ఇనిస్టిట్యూట్ వారు కోటా బ్రాంచ్‌లో స్టార్ బ్యాచ్‌లో 10వ తరగతి, ఇంటర్‌తో పాటు జేఈఈ కలయికతో సాయి అనీష్‌రెడ్డికి స్కాలర్ షిప్ ఇస్తూ శిక్షణను ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అదే విధంగా సింహాద్రిపురానికి చెందిన ఎన్ సుధాకర్‌రెడ్డి, నవీణా దంపతుల కుమారుడు లిఖిత్‌రెడ్డి జేఈఈ మెయిన్స్‌లో 99.91 శాతం సాధించి తన ప్రతిభను చాటాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఇంతటి ర్యాంక్‌లు సాధించగలిగామని సాయి అనీష్‌రెడ్డి, లిఖిత్‌రెడ్డి తెలిపారు.

కొక్కిరాయపల్లె విద్యార్థి ప్రతిభ



చెన్నూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొక్కిరాయపల్లెకు చెందిన మధుమన్మోహిత్‌రెడ్డికి సోమవారం వెలువడిన జేఈఈ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 303 ర్యాంకు సాధించారు. మొత్తం మార్కులు 49 రాగా అందులో పాజిటివ్‌గా 256 రావడం జరిగింది. అలాగే 303 ర్యాంకు రావడంతో ఆ విద్యార్థిని తల్లిదండ్రులు మాధువేణుగోపాల్‌రెడ్డి ప్రశాంతి అభినందించారు.

పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను ఎస్‌జీటీలకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులన్నీ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఏబీ రామకృష్ణంరాజు, యు.రామసుబ్బన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కడప నగరం నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ మోడల్ ప్రాథమిక పాఠశాలలకు కేటాయించిన ప్రధానోపాధ్యాయుల పోస్టును నూరుశాతం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని, అలాకాకుండా పాఠశాల సహాయకుల స్థాయిన తగ్గిస్తూ వారిని తాత్కాలిక ప్రాతిపదికన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా నియమించడం అటు విద్యావ్యవస్థకు, ఇటు ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు తీసుకొని వచ్చే చర్యని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఏ జిల్లా గౌరవాధ్యక్షుడు కూరాకు రవీంద్ర, జిల్లా ఆర్థిక కార్యదర్శి అవధానం చలపతిరాజు, రాష్ట్ర కౌన్సిలర్‌లు అబ్దుల్ గఫూర్, నారాయణరెడ్డి, ఎన్‌టీఏ నాయకులు నాగరాజు పాల్గొన్నారు.


చట్టప్రకారం రావాల్సినవి కూటమి సాధించాలి

తులసిరెడ్డి డిమాండ్

వేంపల్లె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీపై ఆధారపడి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనుగడ సాగిస్తున్న నేపథ్యంలో చట్టప్రకారం రావాల్సిన విభజన అంశాలు కూటమి ప్రభుత్వం సాధించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికారిప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విభజన జరిగిన 11 సంవత్సరాలు అయిందన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, రూ.5లక్షలకోట్ల మేరకు రాష్ట్రానికి ఆర్థికసాయం చేయడం అమలు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే దురదృష్టవశాత్తు రాష్ట్ర విభజన అనంతరం కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ అధికారంలోకి రావడంతో అమలుకు నోచుకోలేదన్నారు. విభజన చట్టం ప్రకారం కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాల్సింది కొండంత అయితే ఇచ్చింది మాత్రం గోరంత అన్నారు.

మహానాడు ప్రాంగణం పూర్తిస్థాయిలో శుభ్రం

చెన్నూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మూడురోజులపాటు కడప నగరంలో జరిగిన మహానాడు ప్రాంగణాన్ని ఎమ్మెల్యే పుత్తాక్రిష్ణచైతన్యరెడ్డి ఆదేశాల మేరకు ఆది, సోమవారాల్లో పూర్తిస్థాయిలో శుభ్రం చేశామని మండల కన్వీనరు కె.విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఇటీవల మహానాడు జరిగిన మూడురోజుల పాటు అక్కడ హాజరైన ప్రజలు తాము పలురకాల ప్లాస్టిక్ ఇతర వస్తువులు వేశారని వాటిని ప్రస్తుతం పూర్తిస్థాయిలో తొలగించి స్వచ్ఛత ఆంధ్రకు బాసటగా నిలిచామన్నారు.



మహానాడు ప్రాంగణం వద్ద పూర్తిస్థాయిలో శుభ్రపరిచిన దృశ్యం



వైవీయూలో 5వేల మొక్కలకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్న అటవీశాఖ

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న యోగివేమన యూనివర్సిటీలో మొక్కలు నాటే కార్యక్రమానికి అటవీ శాఖ శ్రీకారం చుడుతోంది. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లాఅటవీ అధికారి వినీత్ కుమార్ తెలిపారు. జూన్ 5న హరిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన వివరిం చారు.

జీఎస్ మూర్తికి సన్మానం

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మాసాపేట 26వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీటీడీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా నియా మకం అయిన సీనియర్ న్యాయవాది జీఎస్ మూర్తిని 26వ డివిజన్ ఇన్‌చార్జి చవలముడి శంకర్ ఆధ్వర్యంలో శాలువతో సత్కరించి గజపూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, ప్రభుత్వ మాజీ న్యాయవాది గడ్డ గుర్రప్ప, తెలుగు మహిళ కడప జిల్లా ఉపాధ్యక్షురాలు చవలముడి మౌనిక, టీఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడుఅనిల్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల పక్షాన పనిచేయండి'

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 2 (ఆంధ్ర జ్యోతి):ఒక ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజల పక్షాన పనిచేయాలే తప్ప ఏ పార్టీకి తొత్తులుగా వ్యవహరించకూడదని వైసీపీ కార్పొరేటర్లు తెలిపారు. సోమవారం కడపకార్పొరేషన్‌లో ఏర్పాటుచేసిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో కమిషనర్ మనోజ్‌రెడ్డిని కలిసి వారు వినతిపత్రం సమర్పించారు.కార్పొరేషన్‌లో కార్పొరేటర్లు ఒక భాగమని నగరం అభివృద్ధి, సమస్యల పరిష్కారంలో బాధ్యతగా ఉంటారని చెప్పారు.

'విభజన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలం'



మాట్లాడుతున్న సంగటి మనోహర్

కడప మారుతీనగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి 12వ సంవత్సరంలోకి అడుగిడినా నేటికీ విభజన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని మహాజన రాజ్యం పార్టీ (ఎంఆర్‌పీ) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సంగటి మనోహర్ విమర్శించారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మహాజన రాజ్యం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడి ఘటనకు పూర్తిగా కేంద్రమే బాధ్యత వహించాలన్నారు. గత వైసీపీ 5 సంవత్సరాల పాలనలో రాష్ట్రం అన్నిరంగాలలో సర్వనాశనమైందన్నారు. అణగారిన వర్గాలపై యథేచ్ఛగా దాడులు, దౌర్జన్యాలు మితిమీరిపోవడంతో ప్రజలు విసిగి వేసారిపోయి గత ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు షేక్ హుమేర, చంద్రకళబాయి, యాస్మీన్, నాయకులు ఖాజా మొయినుద్దీన్, అమీన్‌పీరా, రామకృష్ణయాదవ్, గిరిధర్, జిల్లా కన్వీనర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చలో సెక్రటేరియట్

కడప సెవెన్ రోడ్స్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు, టిడ్కో ఇళ్ల పంపిణీ, సూపర్‌సిక్స్ పథకాల అమలు సత్వరమే చేపట్టకపోతే చలో అసెంబ్లీ, చలో సెక్రటేరియట్ కార్యక్రమాలకు సమాయత్తమవుతామని సీపీఐజిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం సీపీఐ చేపట్టిన తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలో భాగంగా కడప తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సీపీఐనాగర కార్యదర్శి వెంకటశివ, సహాయ కార్యదర్శులు బాదుల్లా, మద్దిలేటి, నగర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు మోసం

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష విమర్శించారు. సోమవారం కడప నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. రేషన్ వాహనాలను తొలగించి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు యానాదయ్య, షఫీ, బంగారు నాగయ్య యాదవ్, జయచంద్రారెడ్డి,వేణుగోపాల్‌నాయక్, గురుసాయిదత్త, జఫ్రుల, తోట కృష్ణ, చాంద్‌బాష, అబ్దుల్లా పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు ధరించాలి

కడప క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ జయరాములు హెచ్చరించారు. సోమవారం ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బుల్లెట్ వాహనాల సైలెన్సర్‌లు మార్చి నడుపుతున్న వారికి జరిమానా విధించి బైక్‌ల సైలెన్సర్‌లను తీసివేయించారు. మరోసారి శబ్ద కాలుష్యం చేసి ఇతర సైలెన్సర్లువాడితే బైక్ సీజ్ చేస్తామని హెచ్చరించారు.

బీఈడీ పరీక్షలను వాయిదా వేయాలి

కడప సెవెన్ రోడ్స్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కడప యోగి వేమన యూనివర్సిటీ పరిధిలో జరగబోవు బీఈడీ పరీక్షలను డీఎస్సీ పరీక్ష నేపథ్యంలో వాయిదావేయాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎం.ఓబులేసుయాదవ్ ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 6వ తేదీ నుంచి డీఎస్సీ పరీక్షల నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని ఈ తరుణంలో టీటీసీ చేసిన విద్యార్థులు యోగివేమన యూనివర్సిటీ పరిధిలో బీఈడీ చదువుతున్న విద్యార్థులకు 16వ తేదీ నుంచి పరీక్షల షెడ్యూల్ విడుదల చేయడం వలన టీటీసీ విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు.

గిరిజనులపై దౌర్జన్యం చేసే వారిపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న సమితి నాయకులు

కడప మారుతీనగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలం వనిపెంట గ్రామ గిరిజన వర్గానికి చెందిన అన్నదమ్ములు వాయల సురేష్, రాజేష్, సురేష్‌కు పిత్రార్జితంగా సంక్రమించిన భూమిని హస్తగతం చేసుకోవాలనే కుట్రతో అదే మండలం తిప్పిరెడ్డిపల్లె అగ్రకులానికి చెందిన ఓ ఛోటా నాయకుడు పదే పదే వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ దౌర్జన్యానికి పాల్పడడం దారుణమని ఏపీ ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు పెనుగొండ పుల్లయ్య పేర్కొన్నారు. తక్షణమే అతనిపై ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాని కోరారు. ఆ మేరకు సోమవారం స్థానిక ఎర్రముక్కపల్లెలో ఉన్న వైహెచ్‌పీఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ విషయంపై ఎస్పీని సోమవారం కడపలో ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు వెల్లడించారు. సమావేశంలో సమితి నాయకులు రామాంజనేయులు, ఎస్. వెంకటసుబ్బయ్య, ఎస్. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగ భృతిపై ప్రస్తావన ఎక్కడ?'

కడపసెవెన్ రోడ్స్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా నిరుద్యోగ భృతిపైన మహానాడులో ప్రస్తావన లేదని అమలుకు ఎప్పుడు చర్యలు తీసుకుంటారో తెలపాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ ప్రకటన ద్వారా కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కానీ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్న ఇంత వరకు హామీ అమలుకు నోచుకోలేదన్నారు.

గోసంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గోవులను వధించకుండా సంరక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రముఖ్ మల్లికార్జునరావు పేర్కొన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని పండుగల సందర్భంగా గోవులను వధించడానికి అక్రమంగా రవాణా చేయడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారని అలాంటి వాటిపై పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు నాగమునిరెడ్డి మాట్లాడుతూ గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. సహకార్యదర్శి రమేష్, జిల్లా కార్యదర్శి విజయకుమార్, సేవా ప్రముఖ్ భవానీశంకర్ పాల్గొన్నారు.

అంజుమన్ చైర్మన్ ముక్తియార్ కు సన్మానం



ముక్తియార్‌ను సన్మానిస్తున్న నాగరాజు

ప్రొద్దుటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు అంజుమన్ చైర్మన్ గా ఎన్నికైన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్‌ను వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు ఘనంగా సన్మానించారు. సోమవారం ముక్తియార్ స్వగృహం వెళ్లి శాలువ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పేద ముస్లింలకు మక్కాయాత్ర అవకాశం కల్పించాలి

ప్రొద్దుటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పేద ముస్లింలకు మక్కా యాత్ర చేసే అవకాశం కల్పించాలని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్ డిమాండ్‌చేశారు. సోమవారం విజయవాడలోని హజ్‌కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషాను కుతుబుద్దీన్ కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. రాబోవు రోజుల్లో కడప జిల్లాలో ముస్లింకు హజ్ యాత్రకు అవకాశం కల్పించాలని కోరారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: BADVEL.
O.S.No: 9/2021
Muthukuru Chadive Amara Nath Reddy ...Plaintiff
Vs
D.Malyadri ...Defendant
Notice to Defendant
D.Malyadri S/o Malakondaiah, C/o Kondaveedu Enclave 204, Near Kaza Toll Gate, Guntur, Guntur District.
పై నెంబరుగల దావాలో వాది మీ నుండి ప్రామిసరి నోటు బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తం **తే:18-06-2025దికి** వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
వి.నాగేశ్వర్ వి చౌదరి,
సయ్యద్ నాసర్‌బాషా,
కె.అవినాష్,
వాది తరఫు అడ్వకేట్స్

రోడ్ల దుస్థితి మారదా !

● గుంతలమయమైన జమ్మలమడుగు రోడ్డు
● ప్యాచింగ్‌లు కూడా చేయని ఆర్‌అండ్‌బీ అధికారులు



సాయికుటీర్ రోడ్డు సర్కిల్లో రోడ్డు దుస్థితి

ప్రొద్దుటూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):ప్రధాన రోడ్లపైన ఏర్పడ చిన్నపాటి గుంతలను సైతం పట్టించుకోకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న రోడ్ల దుస్థితి నేటికి మారలేదు. దీంతో గుంతలతో దారుణంగా మారడంతో ప్రయాణికులు రోజు నరకయాతన అనుభవిస్తున్నారు. కానీ రోడ్లు భవనాల శాఖ అధికారులకు కానీ ప్రజా ప్రతినిధులకు కానీ రోడ్ల దుస్థితి పట్టడం లేదు. వివరాల్లోకి వెళితే ప్రొద్దుటూరు పట్టణంలోని జమ్మలమడుగు రోడ్డు గుంతలతో అధ్వానంగా తయారైంది. గత రెండేళ్ల క్రితం పట్టణంలో బొల్లవరం నుంచి అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు వరకు జమ్మలమడుగు ప్రధాన రోడ్డు మార్గాన తాగునీటి మెయిన్ పంపింగ్ లైను ఏర్పాటు చేశారు. పైపు లైను నిర్మాణం కోసం ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గం అంతా తవ్వేశారు. టెస్టింగ్ పేరుతో చాలా కాలం తవ్విన పైపులైను గుంతలు పూడ్చలేదు. పబ్లిక్ హెల్త్ అధికారులు కూడా నిర్లక్ష్యం వహించారు. ఆ తరువాత వాటిపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో పైప్‌లైన్ గోతులను ప్యాచ్‌లు వేసి పూడ్చారు కానీ ఆ పనులు సక్రమంగా జరగలేదు. దీంతో అప్పటి నుంచి ఆ రోడ్డు బొల్లవరం నుంచి మున్సిపల్ హైస్కూలు వరకు అనేక చోట్ల గుంతలు బయట పడ్డాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వారికి చాలా మంది ఈ గుంతల్లో పడి ప్రమాదాలకు గురయ్యారు. . కార్లు బస్సులు ఆ గుంతల్లో దిగి దెబ్బ తింటున్నాయని వాపోతున్నారు. ఇక వర్షం వస్తే గుంతలు కనపడక వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌అండ్‌బీ డీఈ ఏమన్నారంటే: వర్షాలు తగ్గుతూనే రోడ్లపై ఏర్పడని గుంతలను పూడ్చ డానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ డీఈ లక్ష్మీ నరసింహులు తెలిపారు. ప్రధాన రోడ్లపై గుంత విషయమై 'ఆంధ్రజ్యోతి' డీఈని వివరణ కోరగా పై విధంగా స్పందించారు.

వాగ్దేవి హైస్కూలు ప్రారంభం



వాగ్దేవి హైస్కూలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లెలో వాగ్దేవి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకంటరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నూతనంగా నిర్మించిన తరగతి గదులు, మైదానం పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను, విద్యాబోధన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాగ్దేవి విద్యాసంస్థలు 30 సంవత్సరాలుగా పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులో అంతర్జాతీయ ప్రమాణాలతో ఉత్తమ విద్యను అందించి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని కోరారు. పాఠశాల చైర్మన్ జి.హుస్సేన్‌రెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడం తమ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. కరస్పాండెంట్ జి.చంద్రావతి మాట్లాడుతూ పెద్దనగరాల్లో అందించే విద్యను తక్కువ ఫీజుకే తమ పాఠశాలలో అందజేస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ ఎం.అరుణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్నాడు అంకాలమ్మ తల్లి తిరునాళ్లు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బి.కోడూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో వెలసిన పల్నాడు అంకాలమ్మ తల్లి తిరునాల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నాయకురాలు నాగమ్మ, పల్నాటి బ్రహ్మనాయుడుకు సంబంధించిన కోడిపుంజుల పందెం నిర్వహించారు. అందులో నాయకురాలు నాగమ్మ కోడి గెలవడం అనంతరం నాయకురాలు నాగమ్మకు సంబంధించిన కథా రూపంలో భక్తులకు వివరించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు విరివిగా పాల్గొని తల్లి దీవెనలు అందుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రికి కోలాట పందేలు నిర్వహించారు. కార్యక్రమాల పర్యవేక్షణ రాష్ట రైతు విభాగ అధ్యక్షులు ఓ.రమణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అక్కడకు వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వెన్నుపోటు దినానికి తరలిరండి

జమ్మలమడుగు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):జమ్మలమడుగులో జరిగే వెన్నుపోటు దినాన్ని ప్రజలు విశేషంగా పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కోరారు. జమ్మలమడుగులో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీసెల్ సెక్రటరి గజ్జెల లక్షుమయ్య, వైసీపీ నాయకులు పోచిరెడ్డి, బడిగించల జనార్దన్, విష్ణు, రుషికేశవరెడ్డి, కొమెర్ల జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోపవరం పంచాయతీలోఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలో మురుగు కాల్వ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. సోమవారం హౌసింగ్ బోర్డు కాలనీలో నున్న సాయిశ్రీనగర్ నుంచి మడూర ఛానల్ వరుకు సుమారు రూ. 27 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనులు సాయిశ్రీనగర్ నుంచి నాలుగు వీధుల్లోని డ్రైనేజీని కాలువకు అనుసంధాన చేసి దానిని ప్రధాన కాలువైన మడూరు ఛానల్‌లో కలిపేలా సీసీడ్రైన్ నిర్మాణ పనులను మొదలు పెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చల పుల్లయ్య, స్థానిక టీడీపీ నేతలు వీరప్రతాప్, లక్ష్మణ, కొండయ్య, ఆదిరెడ్డి, ఓబులశరెడ్డి, తిరుమళరెడ్డి, నాగేశ్వరరెడ్డిలతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరతరెడ్డి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ధర్నాల డ్రామా ఆడుతున్న జగన్ ముఠా



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన ముఠా ధర్నాల డ్రామా ఆడుతున్నారని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి విమర్శించారు. సోమవారం జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుంభకోణాల నుంచి ప్రజాదృష్టి మళ్లించడానికి ధర్నాల డ్రామా ఆడుతున్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో తొలి ఏడాదిలోనే 10 శాతం హామీలు కూడా అమలు చేయలేదని విమర్శించారు. జగన్ కాంగ్రెస్‌ను అడ్డుపెట్టుకుని లక్షల కోట్లు దోచుకుని అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి. శివకుమార్ స్థాపించిన వైసీపీని కబ్జా చేసి ఆయనకు వెన్నుపోటు పొడిచాడని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే మొదటినెలలోనే నాలుగు వేల పెన్షన్ ఇచ్చి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్ర భవన నిర్మాణానికి భూమి పూజ

ముద్దనూరు జూన్2(ఆంధ్రజ్యోతి):మండల పరిధి చెన్నారెడ్డిపల్లె సమీపంలో అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి సోమవారం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి భూమి పూజా చేశారు.ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ 2.25 కోట్లు ఎఫ్ఎంయు హోమ్ అండ్ కోర్ట్స్ నిధులతో అగ్నిమాపక కేంద్రం నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.సీఎం చంద్రబాబు పాలనలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీడీపీ మండల అధ్యక్షులు శివరామిరెడ్డి, మురళీధర్‌రెడ్డి,కేశవరెడ్డి, జగదీశ్వరరెడ్డి, శేఖర్‌నాయుడు, రంగారెడ్డి, బాబురెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి,రామసుబ్బారెడ్డి, బసయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాకు యత్నం.. అడ్డుకున్న అధికారులు

బద్వేలుటౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు పట్టణంలోని శివాలయం మడకలవా రిపల్లె రెవెన్యూ విలేజ్‌లో సర్వే నెంబర్ 982/1, 982/2లలో 9 ఎకరాల 72సెంట్ల భూమిని కొందరు కబ్జాకు యత్నించడంతో ఆలయం చైర్మన్ పాటూరు శివశంకర్‌రెడ్డి, ఆలయ ఈఓ రామలింగారెడ్డి అడ్డుకున్నారు. ఈ భూమి మున్సిపాలిటీ పరిధిలో ఉండటంతో పాటు విలువ కోట్లలో ఉండటంతో కబ్జాదారులు కన్నుపడింది. సోమవారం కొందరు వ్యక్తులు ఆలయ భూమి సుమారు 15సెంట్లు ఆక్రమించేందుకు పునాదులుతీసి ఉంచారు. ఈ విషయాన్ని తెలుసుకున్న శివాలయం చైర్మన్ శివశంకర్‌రెడ్డి ఆలయ ఈఓతో కలసి స్థలాన్ని పరిశీలించి, అది శివాలయంకు చెందిన భూమి అని గుర్తించి, పునాదులపై మట్టివేయించి యథాస్థానంగా ఉంచారు. శివాలయంకు సంబంధించిన భూమిలో ఎటువంటి ఆక్రమణలు చేసి, అక్రమ కట్టడాలు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి

మైలవరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు పొందవచ్చని సబ్‌డివిజనల్ అధికారిణి లక్ష్మిదేవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిన్నకొమెర్ల పొలాల్లో సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుతుపవనాలకంటే ముందుగా భూమిలో నవధాన్యాలు వేసుకోవడం వలన భూమి సారవంతమై పంటల దిగుబడి బాగా వస్తుందన్నారు. . అంతేకాకుండా నత్రజని, కర్బన్ శాతం పెరుగుతుందని, రసాయనిక ఎరువుల అవసరం లేకుండా నే రైతులు మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

పోరుమామిళ్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు తెలిపారు. పోరుమామిళ్ల పోలీసుస్టేషన్ పరిధిలో గత నెలలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఆరు మందిని సోమవారం బద్వేలు కోర్టులో హాజరుపరచగా కోర్టు వారికి ఒక్కొక్కరికి ఐదువేల రూపాయల చొప్పున జరిమానా విధించిందన్నారు. ఎవరైనా మద్యంతాగి వాహనాలు నడిపితే శిక్షార్హులవుతారన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ఖాజీపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ మోహన్ అన్నారు. సోమవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు వాహనాలకు సైలెన్సర్ తీసి నడుపుతున్నట్లు సమాచారం వచ్చిందని, పట్టుబడితే జైలుపాలుకాక తప్పదని విద్యార్థులు గమనించి వాహనాలు ట్రాఫిక్ రూల్స్ ప్రకారం నడపాలన్నారు. అలాగే చిన్నపిల్లలకు స్కూటర్లు ఇస్తే తల్లిదండ్రులదే బాధ్యత అని అన్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా 13 వాహనాలకు రూ.2,400 జరిమానా విధించడం జరిగిందని సీఐ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాములోరి విగ్రహ ప్రతిష్ఠ

బి.కోడూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రెడ్డివారిపల్లె, అక్కుపాలెం గ్రామాల్లో నూతన ఆలయ రాములోరి విగ్రహ ప్రతిష్ఠలు జరుగుతున్నాయి. మూడురోజుల పాటు అక్కుపాలెం గ్రామంలో నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్ఠలు నిర్వహిస్తున్నారు. బుధవారం రాములోరి విగ్రహ ప్రతిష్ఠ, పోలేరమ్మ పోతురాజు ధ్వజారోహణ అనంతరం రాములోరి కల్యాణం జరగనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

పోరుమామిళ్లలో: మండలంలోని గానుగపెంటలో గణపతి, సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి ధ్వజశిఖర కలశ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సోమవారం ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ పంచాయతీరాజ్ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జునరెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, ప్రణీత్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

ఫీజుల పట్టికను ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఫీజుల పట్టికను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాయలసీమ ఇన్‌చార్జి ఆయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8వ తేదీ ఎంపీజే ఆధ్వర్యంలో విద్యార్థులను బడిలో చేర్పించాం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

సర్వర్ ప్రాబ్లమ్... ప్రజలకు ఇక్కట్లు

జమ్మలమడుగు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మోరగుడిలో సోమవారం రేషన్ డీలర్లు సర్వర్ ప్రాబ్లమ్‌తో సకాలంలో రేషన్ ఇవ్వలేకపోయారు. దీంతో ప్రజలు రేషన్‌షాపుల వద్దనే గంటల తరబడి వేచిచూడాల్సివచ్చింది.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్.. తీరని సమస్య



మాట్లాడుతున్న ఎస్.ఉప్పలపాడు గ్రామ మహిళలు

జమ్మలమడుగు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు ఆదర్శ గ్రామాన్ని ఇటీవల కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సందర్శించి ఎస్సీ కాలనీలో సమస్యలను ఇంటింటికి వెళ్లి ఆరా తీశారు. ఆ సమయంలో ఎస్సీ కాలనీలోని కొందరు మహిళలు కలెక్టర్‌తో మాట్లాడుతూ తమకు గత నాలుగు సంవత్సరాలుగా జాబ్‌కార్డు ఉన్నప్పటికి వినియోగంలో లేదని, పని కల్పించలేదని తెలిపారు. ఇందుకు కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి జాబ్‌కార్డుల సమస్య వెంటనే పరిశీలించి అందించాలని ఆదేశించారు. అయినా సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో సోమవారం ఉదయం జమ్మలమడుగులోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయం వద్దకు ఎస్.ఉప్పలపాడు గ్రామ మహిళలు వచ్చి సమస్యను ఎందుకు పరిష్కరించలేదని అధికారులను నిలదీశారు. కాగా ఈ విషయమై "జమ్మలమడుగు ఎంపీడీవో సైదున్నీసాను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఉపాధి హామీ పనులలో ఎస్.ఉప్పలపాడు గ్రామంలో జరిగిన అక్రమాలకు సంబంధించి జిల్లా అధికారులకు నివేదిక పంపడం జరిగిందన్నారు. ఆదర్శ గ్రామం ఎస్.ఉప్పలపాడులో 516 జాబ్‌కార్డులు ఉన్నాయని, అందులో 210 కార్డులు అమలులో ఉన్నాయని తెలిపారు. కూలీలకు 307 రూపాయలు రావాల్సి ఉండగా 301 రూపాయలు పడుతున్నాయని తెలిపారు. జమ్మలమడుగు మండలంలో మొత్తం జాబ్‌కార్డులు 5,878 ఉండగా యాక్టివ్‌గా 3,932 జాబ్‌కార్డులుపనిచేస్తున్నాయన్నారు. అందులో సైతం కొందరు హౌసింగ్ కోసం జాబ్‌కార్డులు తయారు చేసుకున్నారన్నారు. ఎస్.ఉప్పలపాడు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోతే ఇన్‌చార్జిగా నియమించినట్లు ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్‌కు జాబ్‌కార్డుల సమస్య విన్నవించినవారికి వెంటనే సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీవో తెలిపారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి



తహశీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుపేదలకు పట్టణ ప్రాంతాలలో 2, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇంటి నిర్మాణానికి అందిస్తామని, అలాగే ఉచిత బస్సు, సిలిండర్లు, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం లాంటి అనేక హామీలు ఇచ్చి ఇంతవరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ తదితర సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు రూపేశ్‌కు వినతి పత్రం అందించి ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణ ప్రాంతంలో ఇళ్లు లేని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్ల స్థలం ఇస్తామన్నారన్నారు. ఆ హామీని వెంటనే నెరవేర్చాలని ఆయన కోరారు. అలాగే రాజోలి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాంప్రసాద్, సంతోష్, దినేష్, చంద్ర, హరి, సిరివెళ్ల లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక: జమ్మలమడుగులో సీపీఐ నాయకులు సోమవారం సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శిగా రాంప్రసాద్, సహాయ కార్యదర్శిగా సిరివెళ్ల లక్ష్మినారాయణ, కోశాధికారి సంతోష్, కమిటీ సభ్యులుగా మిడుతూరు ప్రసాద్, దండు రవి, తదితరులు ఎన్నికయ్యారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య పేర్కొన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఇంటిస్థలాల కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ మేరకు పట్టణాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇండ్లస్థలం కేటాయించి రెండు ఎకరాల సాగు భూమి అందించాలన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లస్థలాలు కేటాయించకపోతే భూపోరాటానికి తమ పార్టీ సిద్ధమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, శివారెడ్డి, హరి, మద్దిలేటి, ప్రమీళ, యేసోబు, సుజాత, చెన్నమ్మ, పీటర్ పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: మండలంలోని పేదవారికి 3 సెంట్ల ఇంటిస్థలం, కుటుంబ పోషణ కోసం 2 ఎకరాలు బంజరుభూమి కేటాయించి సూపర్‌సిక్స్ పథకాలు అందేలా చూడాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు వీరశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిరెడ్డికాలనీవాసులకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలన్నారు. పుల్లీడు, బొప్పాపురం చున్నారెడిపేటలో దళితులు సాగు చేసిన సర్వే నెం.181లో సాగు భూమి పట్టాలు పంపిణీ చేయాలన్నారు. అనంతరం తహశీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రవికుమార్, పట్టణ సహాయ కార్యదర్శి కేశవ, ఏరియా సహాయకార్యదర్శి పిడుగు మస్తాన్ పాల్గొన్నారు.


బ్రహ్మంగారిమఠంలో: అర్హులైన పేదలకు ఇంటిస్థలాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ, అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో బి.మఠం డిప్యూటీ తహసీల్దారు జాన్సన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకుడు నారాయణ, ఏఐవైఎఫ్ జిల్లాఅధ్యక్షుడు పెదుళ్లపల్లె ప్రభాకర్‌లు మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండలంలో విపరీతంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని వారి వద్ద నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అర్హులైన పేద నిరుపేదలకు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమిరెడ్డిపల్లె నారాయణ, ఊజెర్ల రవి, తేశ్, సృజన్ సురేంద్రపాల్గొన్నారు.

కలసపాడులో: నిరుపేదలకు బంజరు భూమితో పాటు ఇంటిస్థలాలను కేటాయించాలని సీపీఐ మండల కార్యదర్శి సునీల్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మండలంలో ఇళ్లలేని నిరుపేదలకు ఇంటి స్థలం, భూమి లేని వారికి భూ పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు బాష, లక్ష్మీదేవి, సాయమ్మ, వెంకటమ్మ,చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీతో పశువుల దాణా పంపిణీ

కొండాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబన్నపేట రైతుసేవాకేంద్రంలో సోమవారం ప్రభుత్వం సబ్సిడీతో అందజేసే పశువుల దాణాను మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి రాజశేఖరరాజు మాట్లాడుతూ కొండాపురం మండలానికి ఏడు టన్నులు పశువుల దాణా మంజూరయ్యిందన్నారు. సబ్సిడీ పోనూ ఒక ప్యాకెట్ రూ.555 తో రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ వసంతలక్ష్మి, సిబ్బంది రాజప్ప, రైతులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కును పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్

కొండాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కును సోమవారం మాజీ సర్పంచ్ వెల్లాల రామలింగేశ్వరరెడ్డి పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బెస్త పిల్లిరామలింగం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో అతని వైద్య ఖర్చులకుగాను టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి చొరవతో రూ.71,900 మంజూరయింది. దీంతో ఇందుకు సంబంధించిన చెక్కును బాధితునికి అందజేశారు.